



Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 171 | ఆదివారం 07 డిసెంబర్ 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

### ప్రపంచం మందగమనం గురించి మాట్లాడుతున్న తరుణంలో

# మనం వృద్ధి దిశగా పయనిస్తున్నాం

- ప్రతి రంగంలో మహిళలు తమదైన ముద్ర వేస్తున్నారన్న ప్రధానమంత్రి
- భారతదేశ అభివృద్ధిలో నారీ శక్తి పాత్ర పెరిగిందన్న నరేంద్ర మోదీ
- భారతదేశం ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతోందని వెల్లడి



న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, డిసెంబర్ 06

ప్రపంచం ఆర్థిక మందగమనం గురించి మాట్లాడుతున్న ప్రస్తుత తరుణంలో మన దేశం వృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మహిళలు ప్రతి రంగంలో తమదైన ముద్ర వేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రసంగిస్తూ, భారతదేశ అభివృద్ధిలో నారీశక్తి పాత్ర గణనీయంగా పెరిగిందని, దీని ఫలితాలు ఇప్పటికే కనిపిస్తున్నాయని ఆయన తెలిపారు. వలస పాలన నాటి మూలాలను పూర్తిగా వదిలించుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని దేశ ప్రజలకు ప్రధాని పిలుపునిచ్చారు. భారతదేశం ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన వృద్ధి ఇంజిన్‌గా భారత్ ఎదుగుతోందని మోదీ పేర్కొన్నారు. 2025లో ప్రభుత్వం సాధించిన మైలురాళ్లలో ప్రత్యక్ష పన్ను వ్యవస్థలో భారీ సంస్కరణలు ఒకటని ఆయన అన్నారు. రూ. 12 లక్షల వరకు ఆదాయంపై పన్ను లేదని గుర్తు చేశారు.

# అంబేద్కర్ మార్గదర్శి

## - డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ నివాళి

న్యూఢిల్లీ -సూర్య వాస్తవం, డిసెంబర్ 06



డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు పలువురు ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా శనివారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీతోపాటు అనేకమంది ఇతర నాయకులు ఆయనకు నివాళులర్పించారు. పార్లమెంటు ఆవరణలోని ప్రేరణ స్థల్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. భారత దేశంలో న్యాయమైన, సమసమాజాన్ని నిర్మించాలని అంబేద్కర్ తపించారని, ఆయన బోధనలు, పోరాటం నేటికీ సమాజానికి మార్గనిర్దేశం చేస్తూనే

- మిగతా 2లో..




### ప్రతి భారతీయుడి రాజ్యాంగం

# ప్రమాదంలో ఉంది

- లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ

2లో



# 'ఎస్ఐఆర్'లో తప్పుడు వివరాలు..

- దేశంలోనే ఉత్తరప్రదేశ్‌లో తొలి కేసు నమోదు
- సూపర్‌వైజర్ ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు
- బీఎన్ఎస్ చట్టం, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 31 కింద ఎఫ్ఐఆర్ నమోదు
- రాంపూర్ నివాసితులు నూర్జహాన్, ఇద్దరు కుమారులపై ఎఫ్ఐఆర్

2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి



# గిరిజనుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

2లో

- గిరిజనుల ఆదాయ మార్గాలు పెంచడంపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కీలక ఆదేశాలు
- ఎకో టూరిజం, ఉద్యాన పంటల ద్వారా ఉపాధి కల్పనకు సూచన
- ఉపాధి హామీ పథకంతో ఉద్యాన పంటల అనుసంధానం
- ఏజెన్సీలో సినిమా షూటింగ్‌లను ప్రోత్సహించాలని దిశానిర్దేశం

### ఈ సమావేశాల్లో కూడా ఎంపీలు

# బుద్ధిమంతులుగా కూర్చుంటున్నారు

- రాష్ట్ర ఎంపీలపై ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల తీవ్ర ఆగ్రహం
- పార్లమెంటులో రాష్ట్ర హక్కుల గురించి మాట్లాడటం లేదని విమర్శ
- ఎంపీలు మోదీకి రబ్బర్ స్టాంపుల్లా మారారని ఆరోపణ
- ఇప్పటికైనా విభజన హామీలపై నోరు విప్పాలని డిమాండ్



2లో

### ఈ నెల 8, 9 తేదీల్లో

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు

- సీఎం రేవంత్ రెడ్డి విహంగ వీక్షణం
- ఉత్తమ్, కోమటిరెడ్డితో కలిసి ముఖ్యమంత్రి ఏరియల్ సర్వే
- 100 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ఆర్థిక సదస్సు

హైదరాబాద్ - సూర్య వాస్తవం, డిసెంబర్ 06

రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలోని ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8, 9 తేదీల్లో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' జరగనుంది. ఈ సదస్సు ఏర్పాట్లను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్



రెడ్డి విహంగ వీక్షణం ద్వారా పరిశీలించారు. ఫ్యూచర్ సిటీలో 100 ఎకరాల

- మిగతా 2లో..

### పరకామణి చోరీ చిన్న దొంగతనమా?...

# సెటిల్ చేయడానికి జగన్ ఎవరు?

- పరకామణి చోరీపై జగన్ వ్యాఖ్యలు భక్తుల మనోభావాలను దెబ్బతీశాయన్న చంద్రబాబు
- బాబాయి హత్య తరహాలోనే దేవుడి సొమ్ముతో సెటిల్మెంట్లా అని ఫైర్
- రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టీకరణ
- నెల్లూరులో లేడీ డాన్లు తయారవడం ఆశ్చర్యం కలిగించిందని వ్యాఖ్యలు



అమరావతి-సూర్య వాస్తవం, డిసెంబర్ 06

తిరుమల శ్రీవారి పరకామణి చోరీని 'చిన్న దొంగతనం'గా అభివర్ణిస్తూ వైసీపీ అధినేత జగన్ చేసిన వ్యాఖ్యలపై సీఎం చంద్రబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ వ్యాఖ్యలు శ్రీవారి భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసేలా ఉన్నాయని, జగన్‌కు దేవుడన్నా,

- మిగతా 2లో..

# అంబేద్కర్ మార్గదర్శి

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. అంబేద్కర్ దార్శనిక నాయకత్వం, న్యాయం, సమానత్వం, రాజ్యాంగవాదం పట్ల అచంచలమైన నిబద్ధత జాతీయ ప్రయాణానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. మానవ గౌరవాన్ని నిలబెట్టడానికి, ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయడానికి అంబేద్కర్ తరతరాలుగా ప్రేరణనిచ్చారని ఆయన అన్నారు. 'వికసిత్ భారత్ నిర్మాణానికి కృషి చేస్తున్నప్పుడు ఆయన ఆదర్శాలు మన మార్గాన్ని వెలిగిస్తూనే ఉండాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

**అంబేద్కర్ ఒక ఐకాన్ : రాహుల్ గాంధీ**

లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. సమానత్వం, న్యాయం, మానవ గౌరవం అనే ఆయన కాలాతీత వారసత్వం 'రాజ్యాంగాన్ని రక్షించాలనే నా సంకల్పాన్ని' బలపరుస్తుందని అన్నారు. 'అంబేద్కర్ జీ ఒక ఐకాన్. ఆయన మొత్తం దేశానికి ఒక మార్గాన్ని చూపించారు. ఆయన మనకు రాజ్యాంగాన్ని ఇచ్చారు. కాబట్టి, మేము ఆయనను గుర్తుంచుకుంటాం. ఆయన ఆలోచనలను, రాజ్యాంగాన్ని రక్షిస్తాము' అని అన్నారు. 'అంబేద్కర్ మహా పరినిర్వాన్ దివస్ సందర్భంగా ఆయనకు వినయపూర్వకమైన నివాళులు. ఆయన వారసత్వం మరింత సమ్మిళితమైన, కరుణామయమైన భారతదేశం కోసం మన సమిష్టి పోరాటానికి ప్రేరణనిస్తుంది' అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. గతంలో కంటే ఎక్కువగా ఇప్పుడు 'ఆయన జీవిత విలువలను, దేశానికి ఆయన ఇచ్చిన గొప్ప బహుమతి అయిన భారత రాజ్యాంగాన్ని మనం సమర్థించుకోవాలి, పరిరక్షించాలి' అని అన్నారు. రాజ్యాంగ నిర్మాతకు, సామాజిక న్యాయం కోసం అలుపెరగని స్వరానికి తమ ఘన నివాళి అని పేర్కొన్నారు. 'బాబా సాహెబ్ దేశంలో స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, సోదరభావం ఆదర్శాలను సమర్థించారు. అణచివేతకు గురైన అణగారిన వర్గాలతో సహా ప్రతి భారతీయుడి హక్కులను నిర్ధారించడంలో కీలకపాత్ర పోషించారు. బాబా సాహెబ్ ఆదర్శాలు దేశానికి ఎప్పటికీ మార్గనిర్దేశం చేస్తాయి' అని కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. కేంద్ర సామాజిక న్యాయ మంత్రి వీరేంద్ర కుమార్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తదితరులు పార్లమెంటు ఆవరణలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## ప్రతి భారతీయుడి రాజ్యాంగం ప్రమాదంలో ఉంది

### - లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ –సూర్య వాస్తవం, డిసెంబర్ 06:** ప్రతి భారతీయుడి రాజ్యాంగం ప్రమాదంలో ఉంది అని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. నేడు భారత రాజ్యాంగ నిర్మాత బి. ఆర్ అంబేద్కర్ 70వ వర్ధంతి. ఈ నేపథ్యంలో కేంద్రం మహాపరినిర్వాణ్ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా శనివారం పార్లమెంటులో అంబేద్కర్ విగ్రహానికి రాహుల్‌గాంధీ నివాళులర్పించారు. అంబేద్కర్ ఆలోచనల్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించడం ఉమ్మడి జాతీయ బాధ్యత అని పునరుద్ఘాటించారు. రాహుల్ నేడు మీడియాతో మాట్లాడుతూ.. 'బాబాసాహెబ్ అంబేద్కర్ ఒక మహోన్నత జాతీయ వ్యక్తి. ఆయన ఆలోచనలు భారతదేశ ప్రజాస్వామ్య, సామాజిక చట్రాన్ని మార్గనిర్దేశం చేస్తూనే ఉన్నాయి. అంబేద్కర్ ఒక ఆదర్శం. ఆయన దేశం మొత్తానికి ఒక మార్గాన్ని చూపించారు. ఆయన మనకు రాజ్యాంగాన్ని ఇచ్చారు. అందుకే ఆయనను మనం ఇప్పటికీ స్మరించుకుంటున్నాము. ఆయన ఆలోచనల్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి. ఇప్పుడు ప్రతి భారతీయుడి రాజ్యాంగం ముప్పులో ఉంది. మేము దాన్ని రక్షిస్తాము. పౌరులు దానిని రక్షిస్తారు' అని ఆయన అన్నారు.

## 'ఎస్ఐఆర్'లో తప్పుడు వివరాలు..

**- దేశంలోనే ఉత్తరప్రదేశ్‌లో తొలి కేసు నమోదు**
**- సూపర్‌వైజర్ ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు**
**- బీఎన్ఎస్ చట్టం, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 31 కింద ఎఫ్ఐఆర్ నమోదు - రాంపూర్ నివాసితులు నూర్జహాన్, ఇద్దరు కుమారులపై ఎఫ్ఐఆర్**

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, డిసెంబర్ 06**

ఉత్తరప్రదేశ్ పోలీసులు ఓటరు జాబితా నవీకరణ (ఎస్ఐఆర్) సమయంలో సమర్పించిన ఫారమ్‌లలో తప్పుడు సమాచారం ఇచ్చినందుకు ఒక కుటుంబంపై మొట్టమొదటిసారిగా కేసు నమోదు చేశారు. రాంపూర్‌కు చెందిన ఒక సూపర్‌వైజర్ ఫిర్యాదు మేరకు, బీఎన్ఎస్ చట్టం, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 31 కింద ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేయబడింది. రాంపూర్ నివాసితురాలైన నూర్జహాన్, ఆమె ఇద్దరు కుమారులు అమీర్ ఖాన్, డానిష్ ఖాన్ చాలాకాలంగా దుబాయ్, కువైట్‌లలో నివసిస్తున్నారు. ఓటరు జాబితా నవీకరణ కోసం చేపట్టిన ఫారమ్‌లో నూర్జహాన్ తప్పుడు సమాచారం ఇచ్చినట్లు అధికారులు గుర్తించారు. ఆమె తన కుమారులు రాంపూర్‌లోనే నివసిస్తున్నట్లు పేర్కొంది. అంతేకాకుండా, ఫోర్జరీ చేసిన సంతకాలు కలిగిన పత్రాలను బూత్ స్థాయి అధికారికి సమర్పించింది. ఎస్ఐఆర్ వివరాలను డిజిటలైజేషన్ చేస్తున్న సమయంలో నూర్జహాన్ ఇచ్చిన సమాచారం తప్పు అని అధికారులు గుర్తించారు. ఆమె తన కుమారుల సంతకాలను ఫోర్జరీ చేసిందని కూడా గ్రహించారు. ఈ నేపథ్యంలో నూర్జహాన్ కుటుంబంపై పోలీసులు కేసు నమోదు చేశారు. 'ఎస్ఐఆర్' ప్రక్రియలో తప్పుడు సమాచారం ఇచ్చినందుకు కేసు నమోదు కావడం దేశంలోనే ఇది మొదటిసారి.

## 10 నుంచి భారత్, అమెరికా వాణిజ్య చర్చలు

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, డిసెంబర్ 06**

భారత్, అమెరికా మధ్య డిసెంబర్ 10 నుంచి వాణిజ్య ఒప్పంద చర్చలు జరగనున్నాయని అధికార వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీలో మూడు రోజుల పాటు సాగే ఈ చర్చల్లో మొదటి విడత ఒప్పందంపై ప్రధానంగా దృష్టి సారించే అవకాశాలున్నాయి. ఈ చర్చలకు అమెరికా తరఫున హాజరవుతున్న బృందంలో డిప్యూటీ ట్రేడ్ రిప్రెజెంటేటివ్ రిక్ స్విట్జర్ పాల్గొననున్నారు. భారత ఎగుమతులపై అమెరికా 50 శాతం సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు ఆరు విడతలుగా సమావేశాలు జరిగాయి. అయినా పెద్ద ప్రయోజనం లేకుండా పోయింది. ప్రస్తుత ఏడాదిలోనే అమెరికాతో తొలి దశ వాణిజ్య ఒప్పందం జరగొచ్చని ఇటీవల వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ వెల్లడించారు. పూర్తిస్థాయి వాణిజ్య ఒప్పందం దిశగా మరో విడత చర్చలు జరుపుతామని పేర్కొన్నారు.

## పరకామణి చోరీ చిన్న దొంగతనమా?...

# సెటిల్ చేయడానికి జగన్ ఎవరు?

(మొదటిపేజీ తరువాయి)

భక్తులన్నా, ఆలయాల పవిత్రత అన్నా ఏమాత్రం లెక్కలేదని మండిపడ్డారు. శనివారం నాడు అమరావతిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో చంద్రబాబు ఈ వ్యాఖ్యలు చేశారు. "బాబాయి హత్యనే సెటిల్ చేసుకుందామని చూసిన వ్యక్తి, ఇప్పుడు పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమల పరకామణి చోరీని కూడా సెటిల్ చేయాలని చూడటం కంటే ఘోరం ఉంటుందా?" అని చంద్రబాబు ప్రశ్నించారు. దొంగతనం చేసిన వ్యక్తి డబ్బులు తిరిగి చెల్లించాడు కదా, తప్పేముందని జగన్ వాదించడం అనైతికమని అన్నారు.

"భక్తులు ఎంతో భక్తితో సమర్పించిన కానుకలు, ముడుపులను కొట్టేసిన దొంగలతో సెటిల్మెంట్ ఏంటి? రూ.72 వేలు అనేది చిన్న మొత్తమే కావచ్చు, కానీ దేవుడి హుండీలో చోరీ చేయడం చిన్న తప్పా? దాన్ని సెటిల్ చేయడం మహాపాపం కాదా?" అని చంద్రబాబు నిలదీశారు. కోట్ల మంది భక్తుల విశ్వాసాలను దెబ్బతీసేలా మాట్లాడటం ఘోరమని, జగన్ వ్యాఖ్యలపై అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోందని తెలిపారు.

**నెల్లూరులో లేడీ డాన్లు తయారవడం ఆశ్చర్యం కలిగించింది**

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఎలాంటి మొహమాటాలకు తావులేదని చంద్రబాబు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ప్రశాంతంగా ఉండే ప్రాంతాలను సైతం నేరమయం చేసిందని, నేరస్తులను పెంచి పోషించిందని ఆరోపించారు. నెల్లూరులో లేడీ డాన్లు తయారవడం ఆశ్చర్యం కలిగించిందని అన్నారు. "ప్రశాంతతకు మారుపేరైన నెల్లూరు, విజయనగరం లాంటి జిల్లాల్లో గతంలో ఎలాంటి అధికారులను ఎస్పీలుగా నియమించినా సరిపోయేది. కానీ గత ఐదేళ్ల పాలనలో అక్కడ కూడా నేరస్తులు తయారయ్యారు. నెల్లూరులో ఏకంగా లేడీ డాన్లను తయారు చేశారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి సంస్కృతిని పూర్తిగా ప్రక్షాళన చేస్తాం. నేరస్తులను ఏరివేస్తాం, రౌడీలను అణిచివేస్తాం" అని హెచ్చరించారు.

**రాజధాని పనుల్లో వేగం... విద్యారంగంలో మార్పులు**

రాజధాని అమరావతి రైతుల సమస్యలను పరిష్కరిస్తున్నామని, దీంతో నిర్మాణ పనుల్లో వేగం పెరిగిందని చంద్రబాబు తెలిపారు. ఇటీవల తాను రైతులతో నిర్వహించిన సమావేశం సత్ఫలితాలనిచ్చిందని, రెండో దశ భూ సమీకరణకు కూడా రైతులు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు, రైతులు, ప్రభుత్వం సంతోషంగా ఉంటే కొందరికి మాత్రం కడుపు మండుతోందని పరోక్షంగా విమర్శించారు. అదేవిధంగా, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'మెగా పేరెంట్ టీచర్ మీటింగ్' ఒక బ్రాండ్‌గా మారిందని, విద్యాశాఖలో నారా లోకేశ్ తీసుకువస్తున్న సంస్కరణలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని చంద్రబాబు వివరించారు.

# గిరిజనుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

**- గిరిజనుల ఆదాయ మార్గాలు పెంచడంపై డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ కీలక ఆదేశాలు**
**- ఎకో టూరిజం, ఉద్యాన పంటల ద్వారా ఉపాధి కల్పనకు సూచన**
**- ఉపాధి హామీ పథకంతో ఉద్యాన పంటల అనుసంధానం**
**- ఏజెన్సీలో సినిమా షూటింగ్‌లను ప్రోత్సహించాలని దిశానిర్దేశం**

**అమరావతి–సూర్య వాస్తవం, డిసెంబర్ 06**

అడవిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న గిరిజనుల ఆదాయ మార్గాలను పెంచే దిశగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన, గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు పలు సూచనలు చేశారు. గిరిజన అభివృద్ధి, ఎకో టూరిజం, అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. అటవీ, ఆర్గానిక్ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, వాటి తయారీ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా గిరిజనుల ఆదాయాన్ని గణనీయంగా పెంచవచ్చని పవన్ తెలిపారు. అదేవిధంగా, ఏజెన్సీలోని జలపాతాలు, అటవీ ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసి ఎకో టూరిజం ద్వారా స్థానిక యువతకు ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆదేశించారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో ఉద్యాన పంటల సాగును జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేయాలని ఆయన సూచించారు. దీనివల్ల రైతులకు, కూలీలకు ప్రయోజనం చేకూరుతుందని, ఏజెన్సీలో ఆర్థిక వృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయ పడ్డారు. గిరిజన ప్రాంతాల్లో సినిమా, ఓటీటీ ప్రాజెక్టుల షూటింగ్‌లను ప్రోత్సహించడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి కల్పించవచ్చని తెలిపారు. గంజాయి సాగు నిర్మూలన అంశంపై కూడా సమీక్షించిన పవన్, గిరిజనులు ఆ వైపు వెళ్లకుండా వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గిరిజన అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై ప్రతి నెలా నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. అధికారుల సమన్వయంతో గిరిజనుల జీవితాల్లో మార్పు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## ఈ నెల 8, 9 తేదీల్లో

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు

(మొదటిపేజీ తరువాయి)

విస్తీర్ణంలో ఈ అంతర్జాతీయ ఆర్థిక సదస్సును నిర్వహిస్తున్నారు. రెండు రోజుల పాటు జరగనున్న సదస్సులో వివిధ అంశాలపై 27 ప్రత్యేక సెషన్లు నిర్వహించనున్నారు. దేశ విదేశాల నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, సినీ, క్రీడా ప్రముఖులు తరలి వస్తారు.

గ్లోబల్ సదస్సు తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించినదని, తమ విజన్ డాక్యుమెంట్ ద్వారా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. గ్లోబల్ సమ్మిట్ వివరాలను మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ఆయన మీడియాకు వివరించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో 27 సెషన్లు ఉంటాయని, వివిధ రంగాల నిపుణులు, నిష్ణాతులను ఆహ్వానించినట్లు వెల్లడించారు. ఎయిర్‌లైన్స్ సమస్య త్వరలో పరిష్కారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమిట్‌కు వివిధ దేశాల ప్రతినిధులు భారీ సంఖ్యలో వస్తారని వెల్లడించారు. ముఖ్య అతిథులకు సమస్య వస్తే ప్రత్యేక విమానం ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇలాంటి సదస్సు గతంలో ఎన్నడూ జరగలేదని భట్టివిక్రమార్క అన్నారు.

**ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహం**
**అతిథులు, సంస్థల ప్రతినిధులకు తగిన వసతులు కల్పించాలి : అధికారులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశం సమ్మిట్ ప్రాంగణం పరిశీలన**

సమ్మిట్ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. అంతర్జాతీయ కంపెనీలకు చెందిన ప్రతినిధులు, కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సమ్మిట్‌కు హాజరవుతున్నందున వారికి స్వాగత ఏర్పాట్లు, వసతి, ఇతర సదుపాయాల విషయంలో తగు జాగ్రత్తలు వహించాలని అధికారులకు సూచించారు. సీటింగ్, ఫైర్ సేఫ్టీ, వాహన రాకపోకలు, ఇంటర్నెట్ ఇలా ప్రతి అంశంలో తీసుకున్న జాగ్రత్తలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి ఏర్పాట్లపై ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, కుందూరు జయ్ వీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఈ సమావేశాల్లో కూడా ఎంపీలు

# బుద్ధిమంతులుగా కూర్చుంటున్నారు

**- రాష్ట్ర ఎంపీలపై ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల తీవ్ర ఆగ్రహం**
**- పార్లమెంటులో రాష్ట్ర హక్కుల గురించి మాట్లాడటం లేదని విమర్శ**
**- ఎంపీలు మోదీకి రబ్బర్ స్టాంపుల్లా మారారని ఆరోపణ**
**- ఇప్పటికైనా విభజన హామీలపై నోరు విప్పాలని డిమాండ్**

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, డిసెంబర్ 06**

ఆంధ్రప్రదేశ్ ఎంపీలు రాష్ట్ర ప్రయోజనాలను పక్కనపెట్టి, ప్రధాని నరేంద్ర మోదీ మెప్పు కోసం పనిచేస్తున్నారని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పార్లమెంటులో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై నోరు మెదపకుండా, బీజేపీకి బినామీలుగా, మోదీ చేతిలో కీలుబొమ్మలుగా మారారని ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. శీతాకాల పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ఎంపీల వైఖరిపై ఆమె మండిపడ్డారు. షర్మిల స్పందిస్తూ, "రాష్ట్ర విభజన జరిగి 11 ఏళ్లు గడిచినా, విభజన హామీలు ఇప్పటికీ నెరవేరలేదు. పార్లమెంటులో మన ఎంపీలు బుద్ధిమంతుల్లా కూర్చుంటున్నారు. మోదీ మాట్లాడితే చప్పట్లు కొట్టడానికి పోటీ పడుతున్నారు. వారికి రాష్ట్ర ప్రయోజనాల కన్నా సొంత ప్రయోజనాలే ముఖ్యమయ్యాయి. పేరుకు వేర్వేరు పార్టీల ఎంపీలు అయినా, వారంతా బీజేపీకి రబ్బర్ స్టాంపుల్లా మారిపోయారు. బీజేపీ ప్రవేశపెట్టే బిల్లులకు గొర్రెల్లా తలలూపడం తప్ప వారికి ఏమీ చేతకావడం లేదు" అని విమర్శించారు.

విభజన హామీలను ప్రజలకు ఇచ్చిన చెక్కుతో పోల్చిన షర్మిల, "2014 నాటికే విభజన హామీల విలువ రూ. 5 లక్షల కోట్లు. ఆ చెక్కు మన చేతిలో ఉన్నా, దాన్ని ఎన్‌క్యాష్ చేసుకోలేని దుస్థితిలో ఉన్నాం. పోలవరం ఎత్తును 41 మీటర్లకే పరిమితం చేస్తున్నా, అమరావతికి కేంద్రం సాయం చేయలేదని పార్లమెంటరీ కమిటీ చెప్పినా, మన ఎంపీలు మౌనంగా ఉండి గుడ్డి గుర్రాలకు పళ్లు తోముతున్నారు" అని ఎద్దేవా చేశారు. "రాష్ట్రంలో 25 మంది లోక్‌సభ, 11 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారు... మీరు నిజంగా తెలుగు బిడ్డలే అయితే, మీలో ప్రవహించేది తెలుగువాడి రక్తమే అయితే, మీకు ఓట్లు వేసిన ప్రజల మీద కృతజ్ఞత ఉంటే, ఇప్పటికైనా విభజన హామీలపై నోరు విప్పండి. ప్రధాని మోదీ మోసాలను పార్లమెంటు వేదికగా నిలదీయండి" అని కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు.

## అంబేద్కర్‌కు సీఎం రేవంత్ రెడ్డి నివాళి

**హైదరాబాద్ – సూర్య వాస్తవం, డిసెంబర్ 06**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నివాళులర్పించారు. శనివారం హైదరాబాద్ లోని తన నివాసంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా దేశానికి అంబేద్కర్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. బడుగు, బలహీన వర్గాలు, పేదల జీవితాల్లో ఆయన వెలుగులు నింపారని సీఎం తెలిపారు.



## మెరుగైన సౌకర్యాల కల్పనకు అధికారులు కృషి చేయాలి

**- కడప జడ్పీ సమావేశంలో పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి**



**పులివెందుల -సూర్య వాస్తవం, డిసెంబర్ 6:** ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రజా ప్రతినిధులు,అధికారులు కృషి చేయాలని పులివెందుల జడ్పిటిసి మారెడ్డి లతారెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి పులివెందుల జడ్పీటీసీ సభ్యురాలు మారెడ్డి లతా రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనులతో పాటు, ముఖ్యంగా పులివెందుల నియోజకవర్గంలో చేపట్టాల్సిన ముఖ్యమైన పనుల గురించి ఆమె ప్రస్తావించారు.

## ఘనంగా హోంగార్డ్స్ రైజింగ్ డే వేడుకలు

**- హోం గార్డ్స్ ఇన్‌చార్జి ఆర్ఎస్ఐ జాఫర్ ఆధ్వర్యంలో అద్భుతంగా నిర్వహణ**








**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం, డిసెంబర్ 6:** అనంతపురం జిల్లా హెూం గార్డ్స్ రైజింగ్ డే - 2025 వేడుకలు హోం గార్డ్స్ ఇన్‌చార్జి ఆర్ ఎస్ ఐ జాఫర్ ఆధ్వర్యంలో విజయవంతంగా జరిగాయి. మొదటగా నాలుగు ప్లటూన్ల హెూం గార్డ్స్ "గార్డ్ ఆఫ్ ఆనర్" తో అనంతపురం జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ పి. జగదీష్ కి అత్యంత ఘనంగా గౌరవ వందనం సమర్పించారు.అనంతరం అద్భుత పరేడ్ లో భాగంగా నాలుగు ప్లటూన్ల సూపర్ డ్రిల్ హోం గార్డ్స్ నాలుగు ప్లటూన్లు అద్భుతమైన కవాతు ప్రదర్శించి అందరి ఘన ప్రశంసలు అందుకున్నారు.12 ఈవెంట్లలో జోరుగా పోటీ మహిళలు మ్యూజికల్ చైర్, లెమన్ అండ్ స్పూన్ ఈవెంట్లలో నవ్వులతో అలరించారు. ఈ కార్యక్రమంలో 440 మందికి నాణ్యమైన తెల్ల టీ-షర్టులు ఎస్పీ స్వయంగా అందజేశారు. అనంతరం సిబ్బంది విందు భోజనం ఆరగించారు. ఈ కార్యక్రమం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.... హోం గార్డ్స్ పోలీసులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారనీ ప్రశంసించారు.వీరికి ఎల్లవేళలా అండగా ఉంటాం. అవసరమైనప్పుడు వెల్ఫేర్ నుంచి ?50,000 వరకు లోన్ తక్షణం మంజూరు చేసే విధంగా చూస్తామని జిల్లా ఎస్పీ పి. జగదీష్ హామీ ఇచ్చారు. "ఇది వారి రోజు వీరిని ఎట్టి పరిస్థితు ల్లోనూ సంతోషంగా ఉంచాలనీ ఎస్పీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో...అదనపు ఎస్పీ (ఏఆర్), డీఎస్పీ (ఏఆర్) కష్టపడి కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించారు.

## ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తే చర్యలు



**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 6:** పులివెందుల పట్టణ పరిధిలో హెూటల్ యజమానులు ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తే హోటల్ లైసెన్సులు రద్దు చేయడం జరుగుతుందని జరిమానాలు విధించడం జరుగుతుందని పులివెందుల పురపాలక కమిషనర్ రాముడు పేర్కొన్నారు. వాటిలో భాగంగా శనివారం మున్సిపల్ కమిషనర్ డి. రాముడు ఆదేశాను సారం వార్డు సచివాలయ శానిటరీ సెక్రటరీలు స్థానిక ముద్దనూరు రోడ్డు నందు గల ,హెూటళ్లు, నుండి ప్రభుత్వ నిషేధిత సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్లను మరియు ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు.నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తే సదరు అంగడి మరియు హెూటల్ యొక్క లైసెన్సులను రద్దు చేసి అపరాధ రుసుము విధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది హెూటల్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.



# కష్టసమయంలో కూటమి నాయకుల భరోసా

- తుఫాను బాధితులకు భారీ ఆహార సహాయం
- దిత్వా తుఫాను బాధితులకు ఆహారాధారం - కూటమి నేతల చేతుల మీదుగా 300 ప్యాకెట్ల పంపిణీ
- ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆదేశాలపై గూడలి పంచాయతీలో సహాయ కార్యక్రమం
- "ప్రజల కష్టాల్లో సేవే ధర్మం" -జిల్లా కార్యదర్శి అల్లం బాబు









**పెళ్లకూరు- సూర్య వాస్తవం, డిసెంబర్ 06:** దిత్వా తుఫాను వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న గూడలి పంచాయతీ ప్రజలకు కూటమి ప్రభుత్వం నాయకులు అండగా నిలిచారు. గూడూరు నియోజకవర్గం ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు గురువారం రాత్రి 300 మంది బాధితులకు బిర్యానీ ప్యాకెట్ల పంపిణీ జరిగింది.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రఘును -ాథ రెడ్డి, ఉదయ్ భాస్కర్ రెడ్డి, జనసేన జిల్లా కార్యదర్శి అల్లంబాబు, అలాగే జనసేన నేతలు ఎల్లసిరి ముత్యాలయ్య, గోవిందు కోటేశ్వరరావు, పరుశురాం, రవి, కోట - వాకాడు జనసేన నాయకులు గుమ్మడి చంద్ర, మున్నా, . రాకేష్,. శీను , కార్యకర్తలు కలిసి పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం పార్టీల నాయకులు కలిసి నిర్వర్తించిన ఈ సహాయ కార్యక్రమం స్థానికులకు ఎంతో భరోసాని చ్చింది.ఈ సందర్భంగా జనసేన జిల్లా కార్యదర్శి అల్లం బాబు మాట్లాడుతూ,,,,"ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు రాజకీయాలు పక్కన పెట్టి ముందుకు రావడం మా బాధ్యత. బాధితుల ముఖాల్లో చిన్న నవ్వు కనిపిస్తే అదే మా సేవకు ప్రతిఫలం. ఈ పరిస్థితుల్లో ప్రజలతో పాటు ఉండడం మా ధర్మం. కూటమి ప్రభుత్వం ప్రజల కోసం ఎన్నుకున్న మార్గం ఇదే. ప్రజల కష్టాల్లో సేవ చేయడం మా ధర్మం. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో మరిన్ని సహాయక చర్యలు చేపట్టడం కొనసాగించనున్నాం," అని పేర్కొన్నారు.తుఫాను ప్రభావంతో ఇళ్లను కోల్పోయిన ప్రజలు ఈ సహాయానికి కృతజ్ఞతలు తెలుపుతూ, "ఈ ఆపద సమయంలో నాయకులు మా కోసం నిలబడటం మాకు నూతన ఆశను ఇచ్చింది" అని తుఫాను బాధితులు తెలిపారు.



# పోటీతత్వంతోనే ప్రతిభకు గుర్తింపు...

- శాస్త్రీయ ప్రతిభను పెంపొందించడానికే కౌశల్ పరీక్షలు
- డైట్ ఇన్చార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి వెల్లడి.
- కౌశల్ జిల్లాస్థాయి విజేతలకు బహుమతుల ప్రదానం






**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, డిసెంబర్ 6** విద్యార్థులు ఇతరులతో పోటీపడి చదివినప్పుడే వారి ప్రతిభకు గుర్తింపు లభిస్తుందని డైట్ ఇన్చార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి అన్నారు. రాయచోటి పట్టణం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శనివారం ఉదయం కౌశల్ జిల్లాస్థాయి విజేతల బహుమతుల ప్రధానం కార్యక్రమాన్ని జిల్లా కోఆర్డినేటర్ మధుమతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డైట్ ఇన్చార్జి ప్రిన్సిపల్ నరసింహారెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల్లో శాస్త్రీయ ప్రతిభను పెంపొందించడానికి కౌశల్ సైన్స్ టాలెంట్ పరీక్షలు దోహదపడతాయన్నారు. విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం పెంపొందినప్పుడే శాస్త్రీయ దృక్పథం అలవడుతుందన్నారు. ఈ సందర్భంగా కౌశల్ జిల్లా కోఆర్డినేటర్ మధుమతి మాట్లాడుతూ 8,9,10 తరగతుల విద్యార్థులకు క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్, రీల్స్ తయారీ అను అంశాలపై పాఠశాల స్థాయి, జిల్లాస్థాయి ఆన్లైన్ పరీక్షలు నిర్వహించామన్నారు. జిల్లా వ్యాప్తంగా 1350 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వారిలో 6 మంది ప్రథమ బహుమతికి, 6 మంది ద్వితీయ బహుమతికి ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా విజేతలకు మొదటి బహుమతికి రూ.1500 నగదును, ద్వితీయ బహుమతికి రూ. 1000 నగదుతో పాటు మేమెంటో, ప్రశంసా పత్రాలను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సైరాబాను, జిల్లా సైన్స్ అధికారి మాట్ల ఓబుల్ రెడ్డి, జి సి డి ఓ సుమతి, ఉపాధ్యాయ సంఘం నాయకులు హరిబాబు, కౌశల్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ వెంకటరమణ, గైడ్ టీచర్లు ఆంజనేయులు, నిర్మల, రెడ్డయ్య, శాంతి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## వైద్య ఆరోగ్య శాఖకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలి

**- ప్రజలకు మెరుగైన వైద్య ఆరోగ్య సేవలు అందించడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలలో ప్రధానమైనది..**

**- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**



**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, డిసెంబర్ 6:** ప్రజలకు మెరుగైన వైద్య ఆరోగ్య సేవలు అందించడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలలో ప్రధానమైనదని, వైద్య ఆరోగ్య శాఖకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని, జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని ఆదేశించారు.అన్నమయ్య జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు , పట్టణ ఆరోగ్య కేంద్రాలలో అందించే వైద్య సేవలు, ఐ ఎం ఆర్, ఎం ఎం ఆర్ ప్రమాణాలు, వివిధ రకాల వైద్య పరీక్షలు, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆరోగ్య కేంద్రాలలో నిర్వహించే రక్త పరీక్షలలో కొన్ని ఆరోగ్య కేంద్రాలలో గర్భవతుల హిమోగ్లోబిన్ శాతం తక్కువగా నమోదు కాబడు తోందని దీనిపై ఆరోగ్య అధికారులు దృష్టి సారించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలతో సమన్వయం చేసుకొని నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. కొన్ని ఆరోగ్య కేంద్రాలలో ఐ ఎమ్ ఆర్ ఎమ్ ఎమ్ఆర్ లు నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోవడం లేదని, సంబంధిత ఆరోగ్య శాఖ అధికారులు, ఏఎన్ఎంలు దృష్టి సారించాలన్నారు. జిల్లాలో ఇటీవల జరిగిన మృతులపై సమీక్షించి తగిన చర్యలు తీసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. సంక్షేమ హాస్టళ్లు పాఠశాలలు గురుకులాలు కస్తూరిబా గాంధీ పాఠశాలలలో ఆరోగ్యశాఖ అధికారులు, ఏఎన్ఎంలు తరచుగా పరీక్షలు నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.



## ఇరుముడి కట్టు- శబరిమలెక్కు

**- అయ్యప్ప శరణ ఘోషతో ఎమ్మెల్సీ శబరిమల యాత్ర**





**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 6:** పులివెందుల పట్టణ పరిధిలోని శ్రీ మిట్టమల్లేశ్వర స్వామి ఆలయంలో శనివారం శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు గురుస్వాముల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి ఇరుముడి కట్టుకొని శబరిమల యాత్రకు బయలుదేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయ్యప్ప స్వామి మాల ధారణ ధరించి నియమనిష్టలతో కఠోర దీక్షను పాటించి హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు ఇరుముడి కట్టి శబరిమల యాత్రకు వెళ్లడం జరుగుతుందని, అయ్యప్ప స్వామి నామం జపిస్తూ, స్వామియే శరణమయ్యప్ప అనే నినాదాలతో ఇరుముడి కట్టి శబరిమల కు బయలుదేరి వెళ్లడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అభిమానులు శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు .

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కు నివాళులర్పించిన ఎమ్మార్పీఎస్ఎస్ నాయకుడు



**పామిడి- సూర్య వాస్తవం:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా పామిడి మండలం జి కొట్టాల గ్రామంలో ఎమ్మార్పీఎస్ఎస్ జిల్లా సెక్రెటరీ కోయిలదిన్నె శంకర్ అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం ఘన నివాళులర్పణ కార్యక్రమం జరిగింది. స్థానికా మండల నాయకులతో కలిసి విగ్రహానికి పూల మాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి దేవస్థానంలో పడిపూజ

**- అయ్యప్ప నామస్మరణతో మారుమోగిన అయ్యప్ప దేవస్థానం**





**పామిడి - సూర్య వాస్తవం, డిసెంబర్ 06:** స్థానిక ప్రధాన రహదారి ప్రక్కన వెలిసిన అయ్యప్ప స్వామి దేవస్థానంలో శనివారం రోజు ప్రసాద్ గురుస్వామి ఆధ్వ ర్యంలో టీ ఇమాంబి నిర్వహించిన పడిపూజ కార్యక్ర మంలో అయ్యప్ప మాల ధరించిన స్వాములు అయ్యప్ప నామస్మరణతో మారుమోగించారు. పడిపూజ అయ్యప్ప మాలధారణ భక్తులుతో కలిసి అయ్యప్ప భజనలతో స్వాములు అయ్యప్ప విగ్రహలకు స్వాముల ఆధ్వర్యంలో అభిషేక పూజలు నిర్వహించి, స్వామి వారికి పూజాధి కార్యక్రమాలు చేసి, స్వామియే శరణమయ్యప్ప అంటూ మాలాధారణ భక్తులు పడిపూజ కార్యక్రమంలో పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు.అనంతరం ఇమాంబి అయ్యప్ప భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అన్నప్రసాదానాలను స్వీకరించారు.

## ఆర్టీసీ కార్మిక నాయకుడు యహియ భౌతికకాయానికి నివాళి

**- రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు**



**రాయచోటి -సూర్య వాస్తవం, డిసెంబర్ 6:** పట్టణంలోని పాత మున్సిపల్ ఆఫీస్ ప్రక్క సందులో నివాసమున్న ఏపీఎస్ ఆర్టీసీ కార్మిక నాయకుడు ఎస్.యహియ బాషా మరణించిన విషయం తెలుసుకున్న రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు, సుగవాసి ప్రసాద్ బాబు విచ్చేసి బౌతికాయానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుగ వాసి ప్రసాద్ బాబు మాట్లాడుతూ ఆర్టీసీలోని ఎన్నో కార్మిక సమస్యలను యహియపరిష్కరించాలన్నారు. నివాళులర్పించిన వారిలో టిడిపి మైనార్టీ నాయకుడు ఇర్షాద్ అలీ ఖాన్ తదితరులున్నారు.

## సచివాలయాలను తనిఖీ చేసిన ఎంపీడీవో



**గాండ్లపెంట - సూర్య వాస్తవం, డిసెంబర్ 06:** మండల కేంద్రంలోని సోమయాజులపల్లి సచివాలయాన్ని మండల ఎంపీడీవో రామకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ సిబ్బందికి ప్రభుత్వ సర్వే గురించి సూచనలు ఇచ్చారు. ప్రజల యొక్క సమస్యల గురించి పంచాయతీ సెక్రెటరీ మరియు సచివాలయం సిబ్బందిని అడిగారు. అదేవిధంగా సచివాలయంలో పనిచేసే ప్రతి ఒక్క ఉద్యోగులు జరగబోయే ప్రభుత్వ సర్వే పనితీరు మెరుగ్గా ఉండాలని, అలాగే ప్రజల సమస్యల పరిష్కారానికై కృషి చేయాలని పరిష్కరించని ఎడల చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ మరియు డిప్యూటీ ఎంపీడీవో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

## వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహంపై దాడి

**- నిందితుడు అరెస్ట్**




**కణేకల్ - సూర్య వాస్తవం, డిసెంబర్ 6:** అనంతపురం జిల్లా కణేకల్ టౌన్‌లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటన చర్చనీయాంశంగా మారింది. నిన్న సాయంత్రం 6.45 గంటల సమయంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం కుడి అరచేయిని ఒక వ్యక్తి రాయితో కొట్టి పాక్షికంగా ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే.పోలీసుల వివరాల ప్రకారం, కణేకల్ మండలం కలేకుర్తి గ్రామానికి చెందిన బోయ ధనుంజయ్య (31) మద్యం మత్తులో టౌన్‌లో తిరుగుతున్న సమయంలో ఒక వ్యక్తితో మాటల తగువు జరిగింది. ఆగ్రహావేశంలో పక్కనే ఉన్న రాయిని తీసుకుని విగ్రహం మెట్లపైకి ఎక్కి విగ్రహంపై దాడి చేశాడు. దీంతో విగ్రహం కుడి అరచేయి పాక్షికంగా విరిగిపోయింది. ఈ ఘటనపై కణేకల్ మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ పాటిల్ బ్రహ్మానంద రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కణేకల్ పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 106/2025, యు/ఎస్ 324(2), 196(1) బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు శనివారం ఉదయం 11.45 గంటలకు ధనుంజయ్యను అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం అరెస్టు చేశారు. అనంతరం అతడిని రాయదుర్గం జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుచేసి రిమాండ్‌కు తరలించారు.ప్రజా ప్రతీకలు, విగ్రహాలపై దాడులు ప్రజాశాంతిని భంగం చేసేవని, ఇటువంటి ఘటనలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని కణేకల్ పోలీసులు తెలిపారు.

# యాంటీ ర్యాగింగ్, డ్రగ్స్- సైబర్ నేరాలపై అవగాహన

**- పులివెందుల అర్బన్ సీఐ సీతారాం రెడ్డి**




**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 6:** యాంటీ ర్యాగింగ్, డ్రగ్స్ సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై విద్యార్థి దశ నుండే అవగాహన కలిగి ఉండాలని పులివెందుల అర్బన్ సీఐ సీతారాం రెడ్డి పేర్కొన్నారు. ఏపీ కార్ల క్యాంపస్‌లో ఉన్న హార్టికల్చర్ కాలేజీలో యాంటీ ర్యాగింగ్ అవేర్నెస్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. విద్యా ర్థులకు ఏవైనా సమస్యలు ఉంటే డయల్ 100కి కాల్ చేయాలన్నారు. పలు సెక్షన్ల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని, వాహనం నడిపేటప్పుడు హెల్మెట్, కారు డ్రైవింగ్ చేసేటప్పుడు సీట్ బెల్ట్ కచ్చితంగా ధరించాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే అపోహలను నమ్మవద్దన్నారు. ఎవరైనా కాల్ చేసి మిమ్మల్ని డిజిటల్ అరెస్ట్ చేస్తామంటే, పోలీసులను సంప్రదించాలని, బ్యాంకు ఖాతా ఏటీఎం కార్డు వివరాలు ఓటిపి వివ రాలు ఇతరులకు తలపరాదని, మెసేజ్లలో వచ్చే బ్లూ లింక్ అనుసరించి వ్యక్తిగత వివరాలు వ్యక్తిగత వివరాలు నమోదు చేయ వద్దన్నారు, సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫిర్యాదు చేయాలని, ఇతర విషయాలపై కాకుండా, చదువుపై శ్రద్ధ పెట్టి మంచి భవిష్యత్తు నిర్మించు కోవా లన్నారు. కానిస్టేబుల్ నర్మద శక్తి యాప్, చట్ట విరుద్ధమైన కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొంటే ఎదురయ్యే ఇబ్బందుల గురించి ఉదాహరణలతో పూర్తి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ అసోసియేట్ డీన్ డాక్టర్ నాగరాజు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వినయ్ కుమార్ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ నాగలక్ష్మి, డాక్టర్ జీవన, డాక్టర్ చిరంజీవి, డాక్టర్ రమేష్ నాయుడు, సూపరిండెంట్ రామచంద్రారెడ్డి, ఏఎస్ఐ వర్మ, కానిస్టేబుల్ శీను,కాంటాక్ట్ లెక్చరర్స్, ఆప్కాస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## భారత రాజ్యాంగ కృషి వలుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్

**- అంబేద్కర్ సేవలు దేశానికి మార్గదర్శకం**




**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 06:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా పులివెందుల పట్టణ పరిధిలోని పాత బస్టాండ్ సమీపము వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పులివెందుల మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి, వరప్రసాద్ ,పులివెందుల పట్టణ వైకాపా కన్వీనర్ హాల్ గంగాధర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, వైసీపీ శ్రేణులు కలిసి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైయస్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగాన్ని భారతదేశానికి అందించిన ఘనత డాక్టర్ అంబేద్కర్‌దేనని గుర్తుచేశారు. ఆ మహనీయుడి పుణ్యఫలంగా నేటి దళిత వర్గాల ప్రజలు చట్టసభల్లో అడుగుపెట్టగలుగుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, నామినేటెడ్ పదవులు, ప్రభుత్వ ఉద్యోగాల్లో దళితులు రాణించడం అతను అందించిన హక్కులే సాధ్యంచేశాయని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను కొనసాగించడం ప్రతి పౌరుని బాధ్యతగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ చంద్రమౌళి, నరసారెడ్డి, కనక, చంద్రమౌళి, రాము, బండల మురళి ,వెంగళ రాయుడు, బ్యాటరీ ప్రసాద్, నాగరాజు, కోళ్ల భాస్కర్ ఇతర వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## కొనసాగుతున్న ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్ల వితరణ



**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 6:** పులివెందులలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్ విభాగము ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రత్యేక శిబిరం మూడవ రోజు కార్యక్రమం నల్లపురెడ్డి పల్లెలో నిర్వహించారని కళాశాల ప్రిన్సిపల్ డా.బి.శ్రీనివడిసెంబ తెలిపారు. ఎన్.ఎస్.ఎస్.2. పి.ఒ.ఎన్.శ్రీనివాసుల రెడ్డి సారథ్యంలో 50 మంది విద్యార్థినులు ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు ఈ శిబిరంలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో చెత్తను శుభ్రం చేసి, కుప్పలు పోసి, గ్రామ పెద్దల సహాయంతో, సచివాలయ సిబ్బంది సహకారంతో ట్రాక్టర్ల ద్వారా డంప్ యాడ్ కి తరలించారు. తర్వాత మొక్కలు నాటడానికి కావలసిన పాదులను తీశారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ డిష్ వెంకటరెడ్డి అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



## దట్టమైన పొగ మంచు

**- రాకపోకలకు తీవ్ర అంతరాయం**



**తొండూరు- సూర్య వాస్తవం, డిసెంబర్ 06 :** తొండూరు మండలంలో దట్టమైన పొగ మంచు ఆవరించింది. వేకువ జామున భారీగా పొగ మంచు కురవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. మండల కేంద్రంలో పలు గ్రామాలలో కనుచూపుమేరలో పొగ మంచు నెలకొంది. ముందు వెళ్తున్న వాహనాలు కనింపకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు,దీంతో వాహనదారులు లైట్లు వేసుకొని ముందుకు సాగారు.. ఇళ్ల మధ్యలో సైతం మంచు కమ్మేసింది. ఈ సంవత్సరం చలికాలంలో పొగ మంచు కురవడం ఇదే మొదటి రోజు. శనివారం ఉదయం నుంచే గ్రామాల్లో పొగ మంచు కప్పి ఉండడంతో ఇంట్లో నుండి బయటికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి నిత్యం ఉదయం వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లేవారు,పాడి పశువుల నుండి పాలు పితికే వారి పరిస్థితి మాత్రం చెప్పనక్కరలేదు. పక్కిల్లు కూడా కూడా కనిపించని పరిస్థితి పొగమంచు గ్రామాలను కమ్మేసింది.

## అయ్యప్ప దర్శనానికి బయలుదేరిన భక్తులు



**తొండూరు - సూర్య వాస్తవం, డిసెంబర్ 06 :** మండల దీక్ష పూర్తి చేసుకుని పలువురు ఇనగలూరు గ్రామంలో ఉన్న అయ్యప్ప స్వామి భక్తులు శనివారరం స్థానిక అంకాలమ్మ దేవాలయంలో ఇరుముడులు కట్టి దేవాలయంలో గురు స్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అయ్యప్ప స్వామికి ముడుపులు చెల్లించేందుకు పలువురు భక్తులు స్వాములకు కానుకు ఇచ్చార్ను అయ్యప్ప భక్తులు శరణు ఘోష చెప్పుకుంటూ అనంతరం ప్రత్యేక వాహనాలలో శబరికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలు అయ్యప్ప స్వాములకు శుభాకాంక్షలు తెలియజేశార్ను అయ్యప్ప స్వామి దర్శన భాగ్యాన్ని భక్తులకు కల్పించాలని ప్రజలు కోరుకున్నారు.

## డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్ఫూర్తి కొనసాగించాలి

**- జనసేన పార్టీ నేత దాసరి రవిశంకర్**



**వేంపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 6:** విశాల భారతదేశంలో సామాజిక సంస్కరణలకు పాదుగొలిపిన మహనీయుడు బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని పులివెందుల నియోజకవర్గ జనసేన పార్టీ నేత డా.దాసరి రవిశంకర్ తెలిపారు. స్థానిక పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి నందు బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి దాసరి రవిశంకర్ ఘనంగా నివాళు లర్పించారు. ఈ సంద ర్భంగా దాసరి రవిశంకర్ మాట్లాడుతూ అణగారిన వర్గాలకు, మహి ళలకు, కార్మిక వర్గాలకు చట్టబద్ధమైన హక్కులు లభించాయన్నారు. రాజ్యాంగంలో బిఆర్ అంబేద్కర్ పొందుపరిచిన అంశాలే కారణమని, ఆ మహనీయుడి వర్ధంతి సందర్భంగా ఈ తరం తప్పనిసరిగా - రాజ్యాంగ రచనలో అంబేద్కర్, ఆయన బృందం పాటించిన విలువలు గురించి తెలుసుకోవాలని, ఆ స్ఫూర్తిని యువత అందిపుచ్చుకోవాలని దాసరి రవిశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ యువ నాయకులు నాగ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## అంజన్న ఆలయంలో విశేష పూజలు

# ప్రత్యేక అలంకారంలో వీరాంజనేయ స్వామి



**సింహాద్రిపురం– సూర్య వాస్తవం, డిసెంబర్ 6** సింహాద్రిపురం గ్రామంలో అతి పురాతనమైన ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ ఆచార్య ఆధ్వర్యంలో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వేకువజామునే స్వామివారికి పంచామృత అభిషేకం సహస్రనామార్చన అష్టోత్తర శతనామావళి తదితర పూజ కైకర్యాల అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు మాట్లాడుతూ ప్రతి శనివారం మంగళవారం భక్తులు మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని విశేష పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించి పూజలు నిర్వహించడం జరుగుతుందని, అంతేకాకుండా మంగళవారం శనివారాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఆలయ నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు

# గ్రామ స్వరాజ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**- ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ స్ఫూర్తితో ముందడుగు**

**- పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బీటెక్ రవి**





**పులివెందుల – సూర్య వాస్తవం, డిసెంబర్ 6:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామాల అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి పేర్కొన్నారు. సింహాద్రిపురం మండలం, నంద్యాలపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించనున్న 'గ్రామ పంచాయతీ భవనానికి' బీటెక్ రవి ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బిటెక్ రవి మాట్లాడుతూ. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, గ్రామాలకు నిధులు–విధులు కల్పించాలన్న ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ బలమైన సంకల్పం, ఐటీ అండ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రోత్సాహంతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామ పాలన సజావుగా సాగడానికి, ప్రజలకు మెరుగైన సేవలందించడానికి పంచాయతీ భవనాలు ఎంతో కీలకమని, అందుకే మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వ హయాం లో నిర్వీర్యమైన పంచాయతీ వ్యవస్థకు, నేడు కూటమి పాలనలో జీవం పోస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విభిన్న ప్రతిభావంతుల స్ఫూర్తి - విశ్వప్రగతికి కీర్తి

**- అంతర్జాతీయ వికలాంగుల వారోత్సవాలు**

**- సీనియర్ అడ్వకేట్ సింగం కరుణాకర్ రెడ్డి**





**పులివెందుల – సూర్య వాస్తవం, డిసెంబర్ 6:** అంతర్జాతీయ వికలాంగుల వారోత్సవాల సందర్భంగా విభిన్న ప్రతిభావంతుల స్ఫూర్తి – విశ్వప్రగతికి కీర్తిలిసీనియర్ అడ్వకేట్ సింగం కరుణాకర్ రెడ్డి నిత్యవసరాల పంపిణీ చేశారు.

అంతర్జాతీయ వికలాంగుల వారోత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న వికలాంగుల కమ్యూనిటీ భవనంలో ఏపీ దివ్యాంగుల నెట్ వర్క్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఒక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన, విశిష్ట అతిథి, ప్రముఖ సంఘసేవకులు నక్కలపల్లి కొండారెడ్డి తదితరులు దివ్యాంగుల స్ఫూర్తిప్రదాత హెలెన్ కెల్లర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం లాయర్ కరుణాకర్ రెడ్డి తన తండ్రి స్వర్గీయ ఎస్వి నారాయణరెడ్డి జ్ఞాపకార్థం 30 మంది దివ్యాంగుల కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగులు లాయర్ కరుణాకర్ రెడ్డిని దృశ్యాలువాతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన అభ్యుదయ కవి, సంఘ సేవకులు నక్కలపల్లి కొండారెడ్డి మాట్లాడుతూ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం కోసం సమాజంలోని అన్ని వర్గాలు కృషి చేయాలని, మానసిక వికలాంగులలో తరచూ వచ్చే ఫిట్స్, మూర్ఛ వ్యాధి నయం చేసేందుకు మానసిక వైద్య నిపుణులచే ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి వారికి స్వస్థత చేకూర్చేందుకు తన వంతు కృషి చేస్తున్నానని తెలిపారు. అనంతరం దివ్యాంగులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.లి ఈ కార్యక్రమంలో వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఇరికిరెడ్డి రఘునాథ రెడ్డి, నక్కలపల్లి కొండారెడ్డి, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

## రాజధాని అమరావతికి

# రెండవ దశ భూ సమీకరణ అనవసరం

**- చంద్రబాబు ప్రభుత్వానికి భూదాహం అనే మాయ రోగం పట్టుకుంది**

**- చంద్రబాబు రాష్ట్ర ముఖ్యమంత్రిగా కాకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారిగా ప్రవర్తిస్తున్నాడు**

**- డాక్టర్ నర్రెడ్డి.తులసి రెడ్డి**



**వేంపల్లి– సూర్య వాస్తవం, డిసెంబర్ 6:** రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వానికి భూ దాహం అనే మాయ రోగం పట్టుకుందని ,చంద్రబాబు ముఖ్యమంత్రిగా కాకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారిగా ప్రవర్తిస్తున్నాడని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ధ్వజమెత్తారు. శనివారం విజయవాడలో ప్రెస్ క్లబ్ లో మాజీ మంత్రివర్యులు వడ్డే శోభనాద్రీశ్వరరావు అధ్యక్షతన రాజధాని అమరావతి కోసం రెండో విడత భూ సమీకరణ కోసం డిసెంబర్ రెండో తారీఖున రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవో ఎంఎస్ నెంబర్ 252 కు వ్యతిరేకంగా రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.ఈ సమావేశంలో తులసి రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సచివాలయం కేవలం 28 ఎకరాలలో నిర్మించబడిందని, సచివాలయం ,రాజభవన్ ,అసెంబ్లీ, హైకోర్టు అన్నీ కలిపి కూడా 300 ఎకరాలకు మించి విస్తీర్ణం ఉండదన్నారు.కానీ ఆంధ్రప్రదేశ్లో 2015 లోనే 29 గ్రామాల పరిధిలో 29వేల 422 మంది రైతుల వద్ద నుండి 34 వేల ఎనిమిది వందల ఇరవై మూడు ఎకరాలు భూ సమీకరణ చేయబడిందని ,దీనికి తోడు 18,925ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని మొత్తం 53 వేల 748 ఎకరాలు తొలివిడతలోనే రాజధాని కోసం భూ సమీకరణ చేయబడిందన్నారు.తెలంగాణ సచివాలయం కేవలం రెండు సంవత్సరాలలో, భారత పార్లమెంటు భవనం కేవలం మూడు సంవత్సరాల్లో నిర్మించబడిందన్నారు. కానీ ఆంధ్రప్రదేశ్లో గత పది సంవత్సరాలుగా రాజధాని నిర్మాణపు పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండి పోయా యన్నారు. ఈ నేపథ్యంలో రాజధాని అమరావతి కోసం రెండవ విడత భూ సమీకరణ కోసం 20వేల 494 ఎకరాలు సమీకరించేటందుకు డిసెంబర్ రెండో తారీఖున జీవో ఎంఎస్ నెంబర్ 252 కూటమి ప్రభుత్వం జారీ చేయడం సోచనియమన్నారు. అమ్మకు అన్నం పెట్టని ప్రబ ద్ధుడు పిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తా అన్నట్లుంది కూటమి ప్రభుత్వ వైఖరి అని తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. తొలివిడతలో భూ సమీకరణ కింద భూములు ఇచ్చిన రైతుల సమస్యలే ఇప్పటివరకు పరిష్కారం కాలేదు. ఈ నేపథ్యంలో రెండో విడత భూసమీకరణ అవసరమా అని తులసి రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణలో శాశ్వత సచివాలయ భవనాన్ని కేవలము రూ 616 కోట్లతో నిర్మించగా ఆంధ్రప్రదేశ్లో తాత్కాలిక సచివాలయాన్ని రూ1151 కోట్లతో శాశ్వత సచివాలయాన్ని రూ4689 కోట్లతో నిర్మించడంలో మతలబు ఏమిటని తులసిరెడ్డి ప్రశ్నించారు. విభజన చట్టంలో సెక్షన్ 94 సబ్ సెక్షన్ 3 ప్రకారం రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వము గ్రాంట్ రూపంలో ఆర్థిక సహాయం చేయాలి. డబుల్ ఇంజన్ సర్కార్ అని గొప్పగా చెప్పుకునే కూటమి ప్రభుత్వం కేంద్రం నుండి గ్రాంట్ రూపంలో రాజధాని నిర్మాణం కోసం నిధులు తెప్పించకుండా 63500 కోట్ల రూపాయలు అప్పు చేయడం సమంజసమా అని తులసి రెడ్డి ప్రశ్నించారు. జీవో ఎంఎస్ నెంబర్ 252ను ఉపసంహ రించుకోవాలని, తొలివిడతలో భూ సమీ కరణ లో భూములు ఇచ్చిన రైతుల సమస్యలను పరిష్కరి ంచాలని ,కేంద్ర ప్రభుత్వంతో పోరాడి చట్ట ప్రకారంగా రాజధాని నిర్మాణం కోసం గ్రాంట్ రూపంలో నిధులు చెప్పించాలని, రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేయవద్దని ,అభివృద్ధి కేంద్రీకరణ ద్వారా రాష్ట్ర విభజనకు బీజాలు వేయవద్దని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు .ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఎం నాయకులు బాబురావు, సిపిఐ నాయకురాలు అక్కినేని వనజ, తిరుపతిరావు, రామచంద్రయ్య ,సుంకర పద్మశ్రీ ,కుర్ర వసుంధర ,వేదవతి, ప్రజాసంఘాల నాయకులు, అమరావతి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళలకు రక్షణ కవచం - 'శక్తి' యాప్...

**- అనంతపురం మహిళా డీఎస్పీ ఎస్ మహబూబ్ బాషా**




**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం, డిసెంబర్ 6:** మహిళలకు, అమ్మాయిల భద్రతలో 'శక్తి' యాప్ రక్షణ కవచం లాంటిదని అనంతపురం మహిళా డీఎస్పీ ఎస్ మహ బూబ్ బాషా పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ మేరకు అనంతపురం మెడికల్ కాలేజీలో నర్సింగ్ విద్యా ర్థినులకు వివిధ అంశాలపై అవగాహన చేశారు. జిల్లా పోలీస్ యంత్రాంగం మహిళా భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో, వర్కింగ్ విమెన్స్ హాస్టళ్లలో, మహిళలు ఉద్యోగాలు చేసే కంపెనీలలో మహిళా భద్రతపై అవగాహన కార్యక్ర మాలను విస్తృతంగా నిర్వహి స్తున్నా మన్నారు. 'శక్తి' యాప్ మహిళలు, బాలికల రక్షణకు అత్యవసర పరిస్థితుల్లో ఎంతగానో ఉపయోగపడు తుందని తెలిపారు. ఈ యాప్ ప్రాముఖ్యత, దానిని ఎలా ఉపయోగించాలో వివరించారు.

**'శక్తి' యాప్ ఎలా ఉపయోగించాలి?**

ఏదైనా అపాయం లేదా అనుకోని ఘటన జరిగి ప్రమా దంలో ఉన్నపుడు 'శక్తి' యాప్ ద్వారా తక్షణ సాయం పొందవచ్చన్నారు. ఎస్.ఓ.ఎస్ బటన్, డయల్ 112 నెంబర్ కు కాల్ చేసిన కేవలం 10 నిమిషాల్లో మీ చెంతకు పోలీసులు చేరుకొని సమస్య పరిష్కరించే దిశగా చర్యలు చేపడతారన్నారు.ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ , గంజాయి అనర్థాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణ, సైబర్ మోసాల గురించి వివరించారు. ఇలాంటి ఆపద సమయాల్లో తక్షణ సహాయం కోసం అందుబాటులో ఉన్న ముఖ్యమైన హెల్ప్‌లైన్ నంబర్లను డీఎస్పీ గుర్తు చేశారు:

- డయల్ 100/112 (అత్యవసర సహాయం)
- చైల్డ్ లైన్ 1098 (పిల్లల రక్షణ)
- గృహ హింస 181
- మహిళ వేధింపులు 1091
- సైబర్ నేరాల టోల్ ఫ్రీ 1930
- సైబర్ మిత్ర

ప్రతి మహిళ తమ భద్రత కోసం ప్రభుత్వ కల్పించిన చట్టాలను తెలుసుకోవడం ఎంత ముఖ్యమో వివరించి, వారిని చైతన్యవంతులను చేశారు.ఈ కార్యక్రమంలో జి.జి.హెచ్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, ఆర్ఎంఓ మేడం హేమలత, తదితరులు పాల్గొన్నారు.



## అంబేద్కర్‌కు నివాళులర్పించిన

# జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్



**పులివెందుల – సూర్య వాస్తవం, డిసెంబర్ 6 :** పులివెందుల పట్టణంలోని క్రిస్టియన్ లైన్ సమీపంలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు, ఏపీ ఫౌండేషన్ అధినేత డాక్టర్ కోలా ప్రసాద్ పూలమాలవేసి నివాళు లర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విశాల భారత దేశంలో సామాజిక సంస్కరణలకు పాదుగొలిపిన మహనీయుడు బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని ఆయన అన్నారు. అణగారిన వర్గాలకు, మహిళలకు, కార్మిక వర్గాలకు చట్టబద్ధమైన హక్కులు లభించాయని అన్నారు. రాజ్యాంగంలో బిఆర్ అంబేద్కర్ పొందుపరిచిన అంశాలే కారణమని, ఆ మహనీయుడి 69వ వర్ధంతి సందర్భంగా ఈ తరం తప్పనిసరిగా – రాజ్యాంగ రచనలో అంబేద్కర్, ఆయన బృందం పాటించిన విలువలు గురించి తెలుసుకోవాలని ఆయన అన్నారు. ఆయన స్ఫూర్తిని యువత అందిపుచ్చుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అశోకు, తరుణ్, మనీ, ప్రకాష్ రాజ్, యెహోషువ, తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలు



**నాయుడుపేట– సూర్య వాస్తవం, డిసెంబర్ 06:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా నాయుడుపేట పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం ఘన నివాళులర్పణ కార్యక్రమం జరిగింది. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం స్థానిక నాయకులతో కలిసి విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాట్లాడుతూ మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగాన్ని భారతదేశానికి అందించిన ఘనత డాక్టర్ అంబేద్కర్‌దేనని గుర్తుచేశారు. ఆ మహనీయుడి పుణ్యఫలంగా నేటి దళిత వర్గాల ప్రజలు చట్టసభల్లో అడుగుపెట్టగలుగుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, నామినేటెడ్ పదవులు, ప్రభుత్వ ఉద్యోగాల్లో దళితులు రాణించడం అతను అందించిన హక్కులే సాధ్యంచేశాయని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను కొనసాగించడం ప్రతి పౌరుని బాధ్యతగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు, నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జివిఆర్ నాయుడు, చిల్లకూరు పిఎసిఎస్ డైరెక్టర్ గోపాల్ కృష్ణ పాల్గొన్నారు. అలాగే టీడీపీ నాయకులు మైలారి రాజశేఖర్, అవధానం సుధీర్, నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కరీంబాయి చెంచయ్య, మల్లికార్జున్ రెడ్డి, పోట్లపూడి రాజేష్, జువ్వలపాటి మస్తాన్, వినుకొండ ధనుంజయ, నిత్య కృష్ణారెడ్డి, అరిగొండ జయరామ్, డి. రవీంద్ర, ఆబోతుల బాబు, గుంటూరు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



– ఉయ్యాల ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథి

**నాయుడుపేట– సూర్య వాస్తవం, డిసెంబర్ 06:** భారత రాజ్యాంగ సృష్టికర్త, స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా నాయుడుపేటలో ఘన నివాళులు అర్పించబడ్డాయి. ఈ కార్యక్రమాన్ని నాయుడు పేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ కుమార్ నిర్వహించారు. శనివారం నాయుడుపేట ఏఎంసీ కార్యాలయంలో డాక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ఉయ్యాల ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం సమర్థవంతమైన పాలకుల చేతిలో ఉంటే దేశం అత్యున్నత ప్రజాస్వామ్య దేశంగా ఎదుగుతుందని, అసమర్థ పాలకులకు రాజ్యాంగం చేరితే దాని విలువ తగ్గిపోతుందని డాక్టర్ అంబేద్కర్ చెప్పిన మాటలను గుర్తు చేశారు. రాజ్యాంగం ద్వారా వచ్చిన ఓటు హక్కుతో ప్రజలు క్రమశిక్షణ గల, సమర్థవంతమైన నాయకులను పాలకులుగా ఎన్నుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

అంతేకాదు, సమాజ సమతా, దళిత వర్గాల అభివృద్ధి కోసం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం నేడు ఫలితాలను ఇచ్చిందని, దళిత మేధావులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు రాజ్యాంగ హక్కులను కాపాడుతూ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఉయ్యాల ప్రవీణ్ తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ కె. గోపాలకృష్ణ, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు, భీమవరం గ్రామ ఉప సర్పంచ్, నాయుడుపేట ఏఎంసి డైరెక్టర్ గోను బాబు, జనసేన మండల నాయకులు గిండి సతీష్, పలువురు డైరెక్టర్లు , పార్టీ నాయకులు పాల్గొన్నారు.






**పామిడిలో:** పామిడి పట్టణంలోని ఎద్దుల పల్లి సర్కిల్ వద్ద ప్రతిష్ఠాత్మకంగా నిలిచిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి నేడు వర్ధంతి సందర్భంగా ప్రచండ రాజు పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ "సామాజిక న్యాయం, సమానత్వం, హక్కుల పరిరక్షణ పై అంబేద్కర్ చూపిన మార్గం యుగాల తరబడి ప్రేరణగా నిలుస్తుంది. ఆయన సూచించిన రాజ్యాంగ విలువలను ప్రతి పౌరుడు గౌరవించి, అమలు చేసే బాధ్యత మనందరిదీ" అని పేర్కొన్నారు. అంబేద్కర్ చూపిన విద్యా విప్లవం, దళితుల సాధికారత, ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ వంటి అంశాలను ప్రజలకు వివరించి, ఆయన ఆద ర్శాలను అనుసరించాల్సిన అవసరాన్ని ప్రచండ రాజు ఈ సందర్భంగా నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ నాయ కులు వెంకటయ్య, తూర్పుంటి ఓబులేసు, మల్లికార్జున, బీజేపీ నాయకులు అంజి నాయక్, కుమార్, స్థానిక నాయకులు ప్రచండ రాజు, శివ ప్రసాద్ తదితరులు పాల్గొని డాక్టర్ అంబేద్కర్‌కు మర్యాదపూర్వకంగా నివాళులు అర్పించారు.





**గాండ్లపెంటలో:** మండలకేంద్రంలో శుక్రవారం మహనీయుడు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దిశంబర్ 6తేదిన వర్ధంతి కార్యక్రమం గాండ్లపెంట మండల కేంద్రం లోని విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కదిరి నియోజక వర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు మేకల నరసింహులు, గాండ్లపెంట మండలం మండల ఎస్సీ సెల్ కన్వీనర్ కొండయ్య, బీసీ సెల్ మండల కన్వీనర్ నాగరాజు, ఎస్టీ సెల్ మండల కన్వీనర్ భూక్యా. వెంకటేష్ నాయక్ వీరి ఆధ్వర్యంలో నివాళి అర్పించే కార్యక్రమం జరుగును. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గాండ్లపెంట మండల వైఎస్సార్ పార్టీ మండల కన్వీనర్ గజ్జల రవీంద్ర రెడ్డి, రాష్ట్ర బీసీ లీడర్ నరసింహ గౌడ్, రాష్ట్ర పంచాయితీ కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, కదిరి నియోజక వర్గం రైతు సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ రెడ్డిమండల జడ్పీటీసీ, జెడ్పీసీఓ ఆఫ్షన్ ఫయాజ్, ఎక్స్ ఎంపీపీ జగన్ మోహన్, ఎంపీటీసీ, సర్పంచ్ లు ఉత్తన, మోటో, మండల సీనియర్ లీడర్ రామంజుల రెడ్డి డాక్టర్ ఖాజవాలి, వైవీ శంకర్ నాయుడు, మైనారిటీ మండల కన్వీనర్ మైను, పాయకట్టుచంద్ర ఎస్టీ లీడర్ బాబిసీన, చిన్నక్క గారిపల్లి సీనా, రవికుమార్ నాయక్, కూరుమామిడి తిమ్మప్ప, లీల రమేష్, అంజి, బాలకృష్ణ, రామకృష్ణ వైఎస్సార్ పార్టీ లీడర్లు కార్యకర్తలు నివాళి కార్యక్రమం లో పాల్గొన్నారు.



**పులివెందుల కాంగ్రెస్ కార్యాలయంలో :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలు శనివారం పులివెందుల కాంగ్రెస్ కార్యాలయంలోఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో బాగంగా పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్ ‌ఛార్జ్ మూలంరెడ్డి ధ్రువకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు పులివెందుల కాంగ్రెస్ కార్యాలయం నందు పులివెందుల కాంగ్రెస్ పట్టణ అద్యక్షులు భోనాల ఖాదర్ వల్లి, పులివెందుల పట్టణ మహిళా అధ్యక్షురాలు విజయ రాయపాటి రాజా చంద్ర బాబుల అద్వర్యం లో భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డా. బి. ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడికి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కేవలం దళిత బహుజనులకే కాకుండా, భారతీయ ప్రజలుగా మనందరి వాడని చెప్పవచ్చు అన్నారు. అంతేకాకుండా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాల్యం నుండి అనేక విమర్శలకు ఎదుర్కొంటు, భిన్నంగా వాటిని చేయిస్తూ, అప్పటి భారతీయ నేతలతో పాటు ఇది ఎదిగిన ప్రముఖ నాయకుడని అంబేద్కర్ గురించి వర్ణించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





**వేంపల్లిలో :** రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా, ముఖ్య అతిథులుగా వేంపల్లి ఎమ్మార్వో హరినాథ్ రెడ్డి, ఆర్ఐ లోకేష్ పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ దళితుల సాధికారత పేద బడుగు వర్గాల కోసం ఆయన జీవితాంతం కృషి చేశారన్నారు స్వేచ్ఛ సమానత్వం కోసం పరితపించే వారన్నారు నవభారత నిర్మాణానికి బాటలు వేసినా దర్శనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని తెలుపుతూ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేద్దామని భావించారు. ఈ కార్యక్రమంలో డీలర్ ఈశ్వరయ్య, డీలర్ నాగిరెడ్డి, డీలర్ వెల్డింగ్ భాష, నాగేష్, డీలర్ అల్లా బాక్సు తదితరులు పాల్గొన్నారు.



**వేంపల్లి ,టీడీపీ కార్యాలయంలో :** వేంపల్లి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు సింగారెడ్డి రామ మునిరెడ్డి రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నామ వేముకుమార్ లు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ భారతదేశానికి మహాత్మాగా నిలిచిన రాజ్యాంగాన్ని అందించిన భారతరత్న బిఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా మహనీయుని స్మృతికి నివాళులు అర్పిస్తున్నాము. అదేవిధంగా నేడు సమాజంలో పేదలకు, బడుగు వర్గాలకు న్యాయం జరుగుతుందంటే వారి స్వరం బలంగా వినిపిస్తుందంటే, వారు తగిన రక్షణ, గౌరవం పొందుతున్నారంటే దానికి కారణం అంబేద్కర్ రాజ్యాంగం అణగారిన వర్గాలలో సాంఘిక రాజకీయ విద్య చైతన్యాలను రంగాలించిన స్ఫూర్తిదాత అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుందాం రాజ్యాంగంలో హక్కులతో పాటు బాధ్యతలను పాటించడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు



**వేంపల్లి– ట్రిపుల్ ఐటీలో :** ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. శనివారం నాడు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ లో జాతీయ సేవా సంస్థ 6, 8, 14 వ యూనిట్ అధికారులు డా. కోనప్ప ,ఎన్. సత్యానందరామ్ ఆధ్వర్యంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 69 వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డైరెక్టర్ ప్రొఫెసర్ కుమారస్వామి గుప్తా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి, దీపం వెలిగించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ అంబేద్కర్ అందరికీ సమాన విద్య, ఆరోగ్యం, ఉపాధి, రక్షణ, నివాసం మరియు భావ ప్రకటనకు సమ న్యాయం రాజ్యాంగంలో పొందుపరిచిన భారతరత్న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. సమ సమాజ నిర్మాణంలో బాబాసాహెబ్ ను ప్రపంచ దేశాలు మరియు ఐక్యరాజ్య సమితి "సింబల్ ఆఫ్ నాలెడ్జ్"గా గుర్తించారని తెలిపారు. అంబేద్కర్ లండన్ విశ్వవిద్యాలయంలోని గ్రంథాలయంలోని పుస్తకాలు అన్నిటిని చదివారని, ఆయన లండన్ నుంచి తిరిగి భారతదేశానికి వస్తున్నప్పుడు ఆయన వెంట దాదాపుగా 20 వేల పుస్తకాలను తీసుకువచ్చారని, ఆయనలాగా మీరు కూడా పుస్తక పఠనం అవలంబించాలని విద్యార్థులకు తెలియజేశారు. సమాజంలో సమానత్వం, విద్య, న్యాయం కోసం అంబేద్కర్ చూపిన మార్గంలో నడవాలని పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యా అధికారి రమేష్ కైలాస్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. దీప్తి, జాతీయ సేవా సంస్థ విభాగపు కార్యనిర్వహణ అధికారులు, అధ్యాపకులు, ఎస్సీ ఎస్టీ సెల్ విభాగపు సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు , విద్యార్థులు పాల్గొన్నారు.



**వేంపల్లి – నలుగురోడ్ల కూడాలిలో :** స్థానిక వేంపల్లెలోని నలుగురోడ్ల కూడాలిలో గల అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించిన జనసేన నాయకులు, పులివెందుల నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్. హరీష్ మాట్లాడుతూ, చరిత్ర లో మరిచిపోలేని వ్యక్తి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అని, బడుగు బాలహీన వర్గాల ఆశాజ్యోతి అని, ప్రతి ఇంట్లో ఆయన యొక్క చిత్రపటం ఉండాలని, ఆయన భారత రాజ్యగం నిర్మాణం వల్లే ఈ రోజు ప్రతి ఒక్క బలహీన వర్గాల ప్రజలు రాజ్య అధికారం అనుభవిస్తున్నారంటే అది అయన కృషి అని కొనియాడారు, ఆయన ప్రతి ఒక్కరి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు అని, ప్రపంచవ్యాప్తంగా గా అధిక విగ్రహాలు కలిగిన వ్యక్తి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని తెలిపారు. కార్యక్రమం లో జనసేన మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మల్లికార్జున , ఇడుపులపాయ జయచంద్ర, లక్ష్మనా, యూత్ లీడర్ శ్యాం, ప్రోగ్రాం కోఆర్డినేటర్ దేవా తదితరులు పాల్గొన్నారు




**కదిరిలో :** ప్రపంచం మేధావులలో అగ్రగామిగ బడుగు బలహీన వర్గాలు, అనగారిన కులాల అభ్యున్నతికి తన జీవితకాలం పాటు ఎన్నో సేవలందించిన భారతరత్న అంబేద్కర్ కు 69వ వర్ధంతి సందర్భంగా కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ శనివారం స్థానిక అంబేద్కర్ కూడలి నందు భారతరత్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతరత్న అంబేద్కర్ తన జీవిత గాథలు ఎన్నెన్నో అవమానాలను భరించి ,అసమానతులను రూపు మార్పి ,సామాన్యుడు సైతం అన్ని రంగాలలో రాణించే విధంగా భారత రాజ్యాంగాన్ని రూపకల్పన చేశారని కొనియాడారు, ఆయన వేసిన బాటలో ఎందరో సామాన్యులు సైతం అత్యున్నత స్థానంలో ఎదగడం ఆయన చేసిన కృషికి నిదర్శనం అన్నారు, భారత రాజ్యాంగాన్ని ముందుచూపుతో రానున్న సాంకేతిక పరిజ్ఞానానికి దీటుగా రూపొందించారని, ఆయన మానవతా వాది కాదని ఆయనలో దైవాంత సంభూతుడు నెలకొన్నాడని కొనియాడారు, ఆయన వేసిన బాటలో నడుచుకుంటూ, ఆయనను స్మరించుకుంటూ, ఆయన అడుగుజాడల్లో నడుద్దామని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు ఎమ్మెస్ పార్థసారథి, స్వచ్ఛభారత్ కార్పొరేషన్ డైరెక్టర్ పర్వీన్ భాను, తెలుగుదేశం పార్టీ నాయకులు కేఎస్ బహావుద్దీన్, కూటమి నాయకులు జనసేన నియోజకవర్గ ఇన్చార్జి నియోజకవర్గం ఇంచార్జ్ భైరప్రసాద్, ఎస్సీ సెల్ నాయకులు రాజశేఖర్ బాబు, దండోరా నాయకులు గూని వాండ్ల జయరాం ,బిజెపి నాయకులు తలుపుల గంగాధర్, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# పాత్రే తప్ప సావిత్రి గారు కనపడేవారు కాదు

**భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు**

మహానటి సావిత్రి 90వ జయంతి సందర్భంగా వారి కుమార్తె విజయ చాముండేశ్వరి ఆధ్వర్యంలో 'సంగమం ఫౌండేషన్' ఛైర్మన్ సంజయ్‌కిషోర్ నిర్వహణలో హైదరాబాద్ లో సావిత్రి మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. సావిత్రి గారి ఫొటోలతో అందంగా తీర్చిదిద్దిన వేదిక పై జరిగిన ఈ జయంతి ఉత్సవాన్ని భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు.
ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ– మహానటికి మరణం లేదని, నవరస అద్భుత నటనా కౌశలంతో ప్రేక్షకులను మైమరపించేవారని అన్నారు. తన నట జీవితంలో ప్రతి చిత్రంలో కూడా కేవలం పాత్ర మాత్రమే కనిపించేదని, సావిత్రి కనిపించేది కాదన్నారు.
కార్యక్రమానికి అధ్యక్షత వహించిన శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ– సినీ రంగానికి సావిత్రి అభినయ నట శాస్త్ర గ్రంథమని, సినీ రంగంలో ఎంతమంది కథానాయికలున్నా మహానటి మాత్రం సావిత్రిగారే అని కొనియాడారు . నటులు, నిర్మాత మురళీమోహన్, తనికెళ్ల భరణి, నన్నపనేని రాజకుమారి, రోజారమణి, శివపార్వతి, తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా 'మహానటి' చిత్ర నిర్మాతలు ప్రియాంక దత్, స్వప్న దత్, రచయిత సంజయ్‌కిషోర్, ప్రచురణ కర్త బొల్లినేని కృష్ణయ్యలను ఘనంగా సత్కరించారు. సావిత్రి గారి 90వ జయంతి సందర్భంగా 90 మంది బాల గాయనీమణులు సావిత్రి గారి పాటల పల్లవులను ఆలపించారు.అనంతరం సావిత్రి గారిపై రూపొందించిన అవార్డు గ్రహీతల డాక్యుమెంటరీలను ప్రదర్శించారు.ఇటీవల నిర్వహించిన సావిత్రి పాటల పోటీ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సంజయ్ కిషోర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

## 'మన శంకర వరప్రసాద్‌గారు' నుంచి
# మరో సాంగ్.. ప్రోమో వచ్చేసింది!




**- 'శశిరేఖ' పేరుతో రానున్న కొత్త సాంగ్**
**- ఈ నెల 08న పాట విడుదల చేస్తున్నట్లు ప్రకటన**
**- అనిల్ రావిపూడి దర్శకత్వంలో భారీ తారాగణంతో సినిమా**

మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మన శంకర వరప్రసాద్‌గారు' (%మీా+%) నుంచి మరో క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. ఈ సినిమా నుంచి రెండో పాటను విడుదల చేసేందుకు చిత్ర బృందం తేదీని ఖరారు చేసింది. 'శశిరేఖ' పేరుతో రానున్న ఈ పాటను ఈ నెల 8న విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా పాటకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన ప్రోమోను కూడా అభిమానులతో పంచుకుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన తొలి పాట 'మీసాల పిల్ల' యూట్యూబ్‌లో సంచలనం సృష్టిస్తూ సినిమాపై అంచనాలను భారీగా పెంచేసింది. ఆ పాట విజయంతో ఫ్యాన్స్ ఉత్సాహంగా ఉండగా, ఇప్పుడు రెండో పాట అప్‌డేట్ వారిలో మరింత జోష్ నింపింది. ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. మెగాస్టార్‌తో పాటు విక్టరీ వెంకటేశ్, నయనతార, కేథరిన్ థ్రెసా వంటి భారీ తారాగణం ఈ సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల, వి. హరికృష్ణ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ చిత్రం కోసం మెగా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.





## వైజాగ్ వన్డేలో టీమిండియా
# ఘన విజయం... సిరీస్ కైవసం

దక్షిణాఫ్రికాతో జరిగిన నిర్ణయాత్మక మూడో వన్డేలో టీమిండియా జయభేరి మోగించింది. విశాఖపట్నం ఏసీఏ–వీడీసీఏ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో 9 వికెట్ల తేడాతో సఫారీ జట్టును చిత్తు చేసి, మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2–1 తేడాతో కైవసం చేసుకుంది. ఈ సిరీస్‌లో తొలి వన్డేలో భారత్ నెగ్గగా, రెండో వన్డేలో దక్షిణాఫ్రికా గెలిచింది. దీంతో ఇరు జట్లకు కీలకంగా మారిన ఆఖరి మ్యాచ్‌లో భారత్ సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది.

271 పరుగుల లక్ష్యఛేదనలో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ అద్భుతమైన శుభారంభాన్ని అందించారు. రోహిత్ శర్మ (75) దూకుడుగా ఆడగా, యశస్వి జైస్వాల్ (116 నాటౌట్) అజేయ సెంచరీతో కదం తొక్కాడు. జైస్వాల్ స్కోరులో 12 ఫోర్లు, 2 సిక్సులు ఉన్నాయి. రోహిత్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన విరాట్ కోహ్లీ (45 బంతుల్లో 65 నాటౌట్) కూడా మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో భారత్ 39.5 ఓవర్లలో కేవలం ఒక వికెట్ మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది. అంతకుముందు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత్, దక్షిణాఫ్రికాను 47.5 ఓవర్లలో 270 పరుగులకు ఆలౌట్ చేసింది. సఫారీ జట్టులో ఓపెనర్ క్వింటన్ డి కాక్ (106) సెంచరీతో ఒంటరి పోరాటం చేశాడు. కెప్టెన్ బవుమా (48) ఫర్వాలేదనిపించినా, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ చెరో నాలుగు వికెట్లతో సఫారీ పతనాన్ని శాసించారు. అర్షదీప్ సింగ్, రవీంద్ర జడేజా చెరో వికెట్ పడగొట్టారు.

# 20,000 పరుగుల క్లబ్‌లో చేరిన రోహిత్ శర్మ..



విశాఖపట్నం వేదికగా దక్షిణాఫ్రికాతో జరుగుతున్న కీలకమైన మూడో వన్డేలో రోహిత్ శర్మ ఒక మైలురాయిని చేరుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో 20,000 పరుగులు పూర్తి చేసిన నాలుగవ భారతీయ ఆటగాడిగా ఆయన రికార్డు సృష్టించాడు. 271 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్ మంచి శుభారంభాన్నిచ్చారు. రోహిత్ శర్మ 20,000 పరుగుల ద్రావిడ్, విరాట్ కోహ్లీల తర్వాత ఈ ఘనత సాధించిన నాలుగవ ఆటగాడిగా రికార్డులకెక్కాడు. కేశవ్ మహరాజ్ వేసిన 14వ ఓవర్లో నాలుగవ బంతికి రోహిత్ శర్మ సింగిల్ తీసి ఈ ఘనతను అందుకున్నాడు. వన్డేల్లో 11,468, టెస్టుల్లో 4,301, టీ20ల్లో 4,231 పరుగులు అతడి ఖాతాలో ఉన్నాయి. ప్రపంచ క్రికెటర్లలో ఈ ఘనత సాధించిన 14వ ఆటగాడుగా రోహిత్ శర్మ నిలిచాడు.

## భావితరాలకు ఆదర్శనీయులు

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్: వై నైరుతి రెడ్డి

**- అంబేద్కర్ విగ్రహానికి పూలమాల తో నివాళులర్పించిన**
**వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు వై నైరుతి రెడ్డి, మున్సిపల్ చైర్మన్ భవాని**



**గుంతకల్ - సూర్య వాస్తవం:** గుంతకల్ పట్టణం అంబేద్కర్ సర్కిల్లో వైయస్సార్ కాంగ్రెస్పార్టీ కుటుంబ సభ్యుల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు నివాళులు అర్పించడం జరిగింది అనంతపురం జిల్లా వైఎస్ ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి మాట్లాడుతూ మనందరికీ తెలుసు మరి ఎన్ని సంవత్సరాలయినప్పటికీ కూడా ఈరోజుటి వరకు కూడా మనం వర్ధంతి, జయంతులు ఎంతో విజయవంతంగా చేస్తున్నాము అంటే మరి గతంలో అటువంటి గొప్ప నాయకుల ఆశయాలు ఆలోచనలు మరి ఈరోజు యువతకు ప్రతి ఒక్కరికి కూడా ధైర్యాన్నిచ్చే విధంగా మరి అంబేద్కర్ గారి ఆలోచనలు గాని ఆశయాలు గాని ఉన్నాయ్ అనడంలో ఎటువంటి సందేహం లేదు. ఈరోజు మరి భౌతికంగా వారు మన మధ్య లేరు అయినా కూడా ఇన్ని సంవత్సరాలు గడిచినప్పటికీ కూడా మరి వారి ఆశయాలు ఆలోచనలతో యువత కూడా ఎంతో ముందుకి ధైర్యంగా కొన సాగుతున్నారు. అంటే నిజంగా మరి అటువంటి గొప్ప వ్యక్తుల ఆలోచనలు అని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు ఈ విషయాలన్నీ కూడా ఈరోజు ప్రతి చిన్న పిల్లవాడికి కూడా తెలుసు అంబేద్కర్ గొప్పతనం ఏమిటి అనేది ఈరోజు అటువంటి గొప్ప వ్యక్తులు ఉండడం వల్లనే మనమంతా ఈ స్వేచ్ఛ వాయువులు పిలుస్తూ ధైర్యంగా మరి ముందుకు సాగుతూ ఉన్నాము. మాజీ ముఖ్యమంత్రివర్యులు జగన్ మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా మాజీ ముఖ్యమంత్రివర్యులు విజయ వాడలో 150 అడుగుల ఎత్తు విగ్రహాన్ని ప్రతిష్టించే మరి అంత గొప్ప కార్యక్రమాన్ని చేపట్టి ఈరోజు విజయవంతం చేస్తే మరి కూటమి నాయకులు ఈరోజు కనీసం మరి మెయిన్టెనెన్స్ కూడా చేయకుండా పట్టించుకోని విధంగా వాళ్ళు ప్రవర్తిస్తుండటం చాలా సిగ్గుచేటు ఏమైనాప్పటికీ కూడా రాజకీయాలనేవి కొంతవరకే ఆలోచన చేయాలి ప్రతి దాంట్లో కూడా రాజకీయం చేసి కక్షసాదింపులు చేయడం అనేది చాలా సిగ్గుచేటు ఈ సందర్భంగా తెలియజేస్తూ మనమంతా కూడా గొప్ప నాయకులై నటువంటి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ లాంటి నాయకుల అడుగుజాడల్లో ముందుకు సాగాలని వారి ఆలోచనలను ఆశయాలను మనం కూడా కొన సాగించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా తెలియ జేస్తూ మరి అదే విధంగా కౌన్సిల్లో కూడా తీర్మానం చేయ డం జరిగింది మరి దానికి కూడా ప్రతి ఒక్కరు కూడా సహకరించే మరి ఈ కార్యక్రమాన్ని కూడా విజ యవంతం చేసే దిశగా మనమంతా ముందుకు సాగాలని ఈ సందర్భంగా తెలియజేస్తూ ఈ అవకాశం ఇచ్చినటువంటి ప్రతి ఒక్కరికి కూడా పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను ఈ కార్యక్రమానికి గుంతకల్ మున్సిపల్ చైర్మన్ భవాని మాజీ చైర్మన్ జింకల రామాంజనేయులు ఎస్సీ సెల్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బంగారు ఆభరణాల కోసం

# ఇంటి ఓనర్‌ను హత్య చేసిన భార్యా,భర్తలు అరెస్ట్



**గుత్తి -సూర్య వాస్తవం, డిసెంబర్ 6:** గుత్తి పట్టణ పరిధిలో జరిగిన ఓ అనుమానుష కేసులు పోలీ సులు అధికారులు ఉత్తేదించా రు ఇంటి ఓనరైన మహిళను హత్య చేసి ఆమె బంగారు ఆ భరణాలను దోచుకున్న భార్య భర్తలను గుర్తించి పోలీసులు అరెస్టు చేశారు.గుత్తి ఆర్ఎస్ కు చెందిన దుద్దిగుంట విజయ లక్ష్మి( రెడ్డమ్మ) భర్త రామాంజ నేయులు రెడ్డి( లేట్) అనే మ హిళ ఇంట్లో అద్దెకుంటూడబ్బు అవసరం కారణంగా గత 26 తేదీ ఉదయం 10:30 నుండి 10:45 మధ్యలో ఆమెను కంప చెట్లల్లో గొంతు పిసికి హత్య చే శారు ఆమె వద్ద ఉన్న బంగారు చైను,కమ్మలు సెల్ఫోన్ తీసు కొని అదే రోజు మధ్యాహ్నం ఒకటి ముప్పై సమయంలో మృతదేహాన్ని వారి ఆటోలో తీసుకుని వైటి చెరువు వద్ద చెరువులో పడేశారు. అనంతరం ఆమె బంగారు చైనును కోసమట్టం ఫైనాన్స్ లిమిటెడ్ గుత్తిలో తాకట్టు పెట్టి వచ్చిన సొమ్మును తమ అవసరాలకు వాడుకున్నారు అదేవిధంగా గతంలో కూడా వారు పని చేసిన ఇంట్లో నుండి బంగారు చైను దొంగతనం చేసి తాకట్టు పెట్టినట్టుగా విచారణలో ఒప్పు కున్నారు.అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు గుంతకల్లు డిఎస్పి,ఏ.శ్రీనివాస్ నాయకత్వంలో గుత్తి సీఐ, ఎం.రామారావు,ఎస్సై,కే. సురేష్,ఏ.నాగప్ప ఇతర సిబ్బంది ఆరో తారీకు సాయం త్రం 4:30 గంటలకు గుత్తి పట్ట ణంలో నిందితులను అరెస్టు చేశారు నిందితులు మందల రాము వయస్సు 48 సంవత్స రాలు తండ్రి పేరు(లేట్) మణి రాజు.వందల అలీసమ్మ వయ సు 39 సంవత్సరాలు భర్త బం ధల రాము,నిందితుల వివరాలు డోర్ నెంబర్ 9/1066 ఏ టి ఆర్ కాలనీ గుత్తి ఆర్ఎస్ గుత్తి టౌన్ పత్తికొండ రోడ్డు పక్కన గు డ్ షెఫర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఎదురుగా గుత్తిలో నివ సిస్తున్నారు.వీరి యొద్ద నుండి పోలీసులు పోక కంపెనీ టచ్ ఫోన్, సాధారణ బంగారు కమ్మల జత, మృత ురాలిది, సామ్సంగ్ కీప్యాడ్ సెల్ ఫోన్ మృ తురాలిది,రగ్గు ముద్దాయిది, బజాజ్ మాక్సిమా ఆటో,ఏపీ 39టి 0684 స్వాధీనం చేసు కున్నట్టు వెల్లడించారు.

## నూతన గృహప్రవేశానికి

# పాల్గొన్న బిఎస్పి పార్టీ నాయకులు

**గుత్తి -సూర్య వాస్తవం, డిసెంబర్ 6:**

గుత్తి మండలం శ్రీపురం గ్రామా గద్దల మోహన్ బాబు నూతన గృహప్రవేశం నకు గుత్తి మండలం బి ఎస్ పి నాయకులు ఎం రామాంజనేయులు, నాయకులు కలిసి అంబేద్కర్ ఫోటోని గిఫ్ట్ ఇవ్వడం జరిగింది. ఆదినారాయణ,రాజు, నరసింహా, బంధుమిత్రులు పాల్గొనడం జరిగింది.



## ఏపీ సోషల్ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ ఇనిస్టూట్ ముగింపు కార్యక్రమం

**- ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కోటేశ్వరి**




**వేంపల్లి -సూర్యవాస్తవం, డిసెంబర్ 6:** అర్జీయూకేటీ ఆర్కే వ్యాలీ ఎన్ఎస్ఎస్ యూనిట్ 4 నిర్వహించిన ఏడు రోజుల ప్రత్యేక శిబిరం ముగింపు కార్యక్రమం శు క్రవారం ఘనంగా జరిగిందని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కోటేశ్వరి తెలిపారు ఈ సందర్భంగా కోటేశ్వరి మాట్లాడుతూ యూనిట్- 4 ఈ7 ప్రజల్లో మారుతి నగర్ గడ్డి గ్రామం, ఏపీ సోషల్ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ పరిధిలో నిర్వహించిన సేవా కార్యక్రమాలపై నివేదిక సమర్పించారు, ఈ సేవ కార్యక్రమాల్లో విద్యార్థులకు సైన్స్ ప్రాజెక్టుల్లో సహాయం, విద్యార్థుల ప్రోత్సాహక సెషన్లు,నది శుభ్రత, స్వేచ్ఛ భారత్ కార్యక్రమం, వృక్షరోపణ, డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు, యోగా శిక్షణ, గుడ్ టచ్- బ్యాడ్ టచ్ అవగాహన, మహిళా భద్రత,బాల్య విద్య, సైబర్ సెక్యూరిటీ,రోడ్డు భద్రత, ఆరోగ్య పరిశుభ్రత వంటి అనేక కార్యక్రమాలు ఉన్నాయి ఈ కార్యక్రమంలో ఆర్జీయూకేటి డైరెక్టర్ కుమార్ స్వామి గుప్త పాల్గొని యూనిట్ 4 అందించిన సేవలను అభినందించారు. ఈ సందర్భంగా ఏపీ సోషల్ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ ప్రిన్సిపల్ సురేంద్ర బాబు, పాఠశాల సిబ్బంది మరియు ఇతరులు కూడా పాల్గొని ఎన్ఎస్ఎస్ యూనిట్ 4 చేసిన సేవలను ప్రశంసించారు. అదేవిధంగా ఎన్ఎస్ఎస్ యూనిట్- 4 మరియు ఏపీ సోషల్ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ మధ్య విద్యార్థులకు సహాయం చేసే దిశగా అవగాహన ఒప్పందం( ఎం ఓ యు ) కుదిరింది అని తెలిపారు జిల్లా సమన్వయ అధికారిని ఏ ఉదయశ్రీ యూనిట్- 4 సేవలను ప్రశంసించారని తెలియజేశారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి

**బహుజన సమాజ్ పార్టీ**
**నాయకుల ఆధ్వర్యంలో ఘన నివాళులు**



**గుత్తి -సూర్య వాస్తవం, డిసెంబర్ 6:** గుత్తి మండలంలోని డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ వర్ధంతి సంద ర్భంగా బహుజన పార్టీ ఆధ్వ ర్యంలో ఘన నివాళులు భార త రాజ్యాంగం రూపశిల్పి స మానత్వం సామాజిక న్యా యం కొరకు తన జీవితాన్ని అంకితం చేసిన మహా నాయ కుడు భారత రత్న డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా నేడు గుత్తి మండ లంలోని బహుజన పార్టీ నా యకుల ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు ఈ కా ర్యక్రమంలో అనంతరం బిఎ స్పి పార్టీ నాయకులు మాట్లా డుతూ.. డాక్టర్ బి.ఆర్ అంబే ద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు అం బేద్కర్ బోధనలు రాజ్యాంగ విలువలు దళితుల బహుజను లు అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటాన్ని స్మరించారు అలాగే యువత విద్యార్థులు మహిళలు స్థానిక ప్రజలు డాక్టర్.అంబేద్కర్ ఆలోచనలను యువత ఆచరణలో పెట్టాలని రాజ్యాంగ విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిభారతం పౌరుడి పై ఉందని సందర్భంగా నాయకులు తెలియజేశారు ఈకార్య క్రమంలో,బహుజన సమాజ్ పార్టీ రాయలసీమ ఇన్చా ర్జ్,గ ద్దల నాగభూషణం,బహుజన సమాజ్ పార్టీ గుంతకల్ నియోజకవర్గం అధ్యక్షులు విజయ్, నియోజకవర్గ ఇన్చార్జ్,బి వెంక ట కొండయ్య, గుత్తి మండల అ ధ్యక్షుడు సుధాకర్,సీనియర్ నాయకులు బి.ఎస్.పి పార్టీ ఎం రామాంజనేయులు,గుత్తి టౌన్ సెక్రటరీ అనురాధ,గుత్తి జాయింట్ సెక్రటరీ రంగమ్మ,గుత్తి ట్రెజరర్కృష్ణ రంగయ్య, రంగప్ప,జి.నాగప్ప,కే.ఎం,రంగనా యకులు, వైఎస్ఆర్ నాయకు లు తదితరులు పాల్గొన్నారు.

## కెవిపిఎస్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69 వర్ధంతి



**గుత్తి -సూర్య వాస్తవం, డిసెంబర్ 6:**గుత్తిలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో డాక్ట ర్ బి.ఆర్ అంబేద్కర్ 69 వర్ధంతి ఎ స్టీఆర్ సర్కిల్ నందు ఘనంగా నిర్వ హించడం జరిగింది. ఈ సందర్భంగా కెవిపిఎస్ మండల కార్యదర్శి మల్లికా ర్జున అంబేద్కర్ విగ్రహానికి పూలమా లవేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది ఈ సందర్భంగా కెవిపిఎస్ మండల కార్యదర్శి మల్లికార్జున మా ట్లాడుతూ అంబేద్కర్ విధివిధానాల్లో ప్రధానంగా సామాజిక న్యాయం స మానత్వం స్వేచ్ఛ స్వభావం అన్ని సూత్రాలపై ఆధారపడి ఉన్నాయన్నా రు ముఖ్యంగా అంటరానితనం కుల వివక్ష నిర్మూలన కోసం పోరాటం చేయాలని అంబేద్కర్ ఆశయాల కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్ర మంలో పాల్గొన్నవారు మహిళా సం ఘం అధ్యక్షురాలు రేవతి కార్యదర్శి రేణుక,వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మల్లేష్,సిఐటి యు జిల్లా కమిటీ సభ్యులు రమేష్, రైతు సంఘం నాయకులు రామకృ ష్ణ, మారి విజయ్,రవి,తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )